


# విజయభాను

45 వ వార్షికోత్సవం
విజయభాను

విశాఖపట్నం, గురువారం 09-09-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 01 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## థర్డ్ వేవ్ సన్నద్ధతపై ప్రణాళిక సిద్ధం

### ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కాన్సెప్ట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### వైద్య, ఆరోగ్య శాఖలపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం



తాడేపల్లి: వైద్య, ఆరోగ్య శాఖలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో కోవిడ్-19 నివారణ, నియంత్రణ, వ్యాక్సినేషన్‌పై అధికారులు సీఎం జగన్‌కు వివరాలందించారు. రాష్ట్రంలో యాక్టివ్ కేసులు 14,452 ఉండగా.. రికవరీ రేటు 98.60 శాతంగా ఉందని తెలిపారు. 10,494 సచివాలయాల్లో యాక్టివ్ కేసులు నమోదు శాతం జీరో అని అధికారులు తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు 3,560 మంది కాగా.. కోవిడ్ కేర్ సెంటర్లలో చికిత్స పొందుతున్నవారు 926 మంది.. హెూం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నవారు 9,966 మంది ఉన్నారని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న బెడ్స్ 92.50 శాతం ఉండగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న బెడ్స్ 70.69 శాతం ఉన్నాయన్నారు. 104 కాల్ సెంటర్‌కు 684 ఇన్‌కమింగ్ కాల్స్ మాత్రమే వచ్చాయని తెలిపారు. 18 దఫాలుగా ఇప్పటివరకు ఫీవర్ సర్వే పూర్తి చేశామని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు.

**థర్డ్ వేవ్ సన్నద్ధతపై ప్రణాళిక సిద్ధం**

కోవిడ్ థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో 20,964 ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ అందుబాటులో ఉన్నాయని.. ఇంకా రావాల్సినవి 2493 ఉన్నాయన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆక్సిజన్ డి-టైప్ సిలిండర్లు 27,311 కాగా.. ఆక్సిజన్ పైప్‌లైన్ పనులు పూర్తైన ఆస్పత్రులు 108 అని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు.

**ఆక్సిజన్ జనరేషన్ (పీఎస్ఏ) ప్లాంట్లు**

50 అంతకంటే ఎక్కువ బెడ్స్ ఉన్న ఆస్పత్రుల్లో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని అధికారులు సీఎం జగన్‌కి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 140 ఆస్పత్రులలో పీఎస్ఏ ప్లాంట్లు ఏర్పాటు చేశామని.. అక్టోబరు 6 నాటికి ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటు పూర్తవుతుందని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు.

వ్యాక్సినేషన్‌జి

రాష్ట్రంలో ఇప్పటివరకు వ్యాక్సినేషన్ చేయించుకున్నవారు 2,23,34,971 మంది ఉండగా.. వీరిలో సింగిల్ డోసు వ్యాక్సినేషన్ పూర్తైన వారు 1,31,62,815 మంది కాగా.. రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తైన వారు 91,72,156 మంది అని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ఇటీవల కేరళలో పర్యటించిన అధికారులు, వైద్యాధికారుల బృందం కోవిడ్‌తో పాటు ఇతర క్షేత్రస్థాయి పరిశీలనాంశాలను సీఎం జగన్‌కు వివరించారు.

**శిశు మరణాలు తగ్గించాలి..**

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "శిశు మరణాలను తగ్గించాలి. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కాన్సెప్ట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. చక్కటి విధివిధానాలను ఖరారు చేయాలి. కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో పీజీ కోర్సులు కూడా ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలి. పారామెడికల్ సిబ్బందికీ మెడికల్ కాలేజీల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. పబ్లిక్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్‌పై కోర్సులు దృష్టి పెట్టాలని" అధికారులను ఆదేశించారు.

**హెల్త్‌డేటాపై అన్నిరకాల చర్యలు తీసుకోవాలి..**

"ప్రజారోగ్యంపై నిరంతర పరిశీలన, పర్యవేక్షణ ఉండాలి. రక్తం, నీరు, గాలి ఈ మూడింటిపైన పరీక్షలు జరగాలి. విలేజ్ క్లినిక్స్ స్థాయిలో

తరువాయి 2లో..

### ప్రపంచ స్థాయిలో రాణించేందుకే

## నూతన విధ్యావిదానం

- ఇంగ్లీష్ లగ్జరీ కాదు నేటితరాలకు అది అవసరం
- వచ్చే ఏడాది నుండి విద్యార్థులకు విద్యాకానుకలో బాగంగా స్పోర్ట్స్ షూ మరియు స్పోర్ట్స్ డ్రస్
- ప్రధాన మంత్రి ఆవాస్ గ్రామీణ యోజక పథకం అమలులో దేశంలోనే రెండు, మూడు స్థానాలలో నిలిచిన నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల అధికార యంత్రాంగానికి అభినందనలు
- కోవిడ్ నియంత్రణలో సత్ఫలితాలనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- ట్విట్టర్ వేదికగా విజయసాయి రెడ్డి



విశాఖపట్నం : గ్లోబలైజేషన్ కారణంగా అంతర్జాతీయ స్థాయిలో పోటీని ఎదుర్కొనేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నూతన విధ్యావిధానాన్ని రూపొందించారని ఈ నూతన విధ్యావిధానం సమర్ధవంతంగా అమలు జరిగినప్పుడే మన విద్యార్దులు ప్రపంచ స్థాయిలో రాణిస్తారని, వారిని ఆదిశగా సన్నద్ధం చేయాలని ముఖ్యమంత్రి అదికారులను ఆదేశించినట్లు రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి వి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలను వెల్లఢించారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను నేటి తరం విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో నాడు-నాడు ఫౌండేషన్ స్కూల్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఆయా శాఖల ఉన్నతాది కారులను ఆదేశించారని ఆయన పేర్కొన్నారు. నూతన విద్యావిధానంలో బాగంగా అన్ని రకాల పాఠశాలలకు సిబిఎస్ఈ ఎఫిలియేషన్, 3 వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తకాల నాణ్యత మరింత మెరుగుపడేలా చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

మానసిక, శారీరక ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో అవసరమని వచ్చేఏడాది నుంచి విధ్యార్దులకు విద్యాకానుకలో బాగంగా స్పోర్ట్స్ షూ, స్పోర్ట్స్ డ్రస్ కూడా అందించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారులను అదేశించినట్లు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. తన ట్వీట్ లో ఈ విషయమై ప్రస్తావిస్తూ స్పోర్ట్స్ షూ, స్పోర్ట్స్ డ్రస్ డిజైన్ మరియు నాణ్యత బాగుండేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు విజయసాయి పేర్కొన్నారు.

ఇంగ్లీష్ లగ్జరీ కాదు అవసరం అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

తరువాయి 2లో..

## కోవిడ్ నిబంధనల మేరకు గణేశ్ ఉత్సవాలు




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు స్థలాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వినాయక చవితి ఉత్సవాలపై దాఖలైన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. నిబంధనలు పాటిస్తూ వినాయక పూజలకు అనుమతించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రైవేటు స్థలాల్లో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవచ్చని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్టికల్ 26తో ప్రజలకు మతపరమైన కార్యక్రమాల నిర్వహణకు ప్రజలకు అధికారం ఉంటుందని.. నిరోధించే హక్కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. కొవిడ్ నిబంధనల మేరకు పూజలు చేసుకోవాలని ప్రజలకు సూచించింది. ఒకేసారి ఐదుగురికి మించకుండా పూజలు నిర్వహించుకోవచ్చునని వెల్లడించింది. మరోవైపు పబ్లిక్ స్థలాల్లో ఉత్సవాలు నిర్వహించడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను సమర్థించింది. ప్రైవేటు స్థలాల్లో కేవలం విగ్రహాల ఏర్పాటుకు అనుమతించాలని ఆదేశాలిచ్చింది.

### సుగమ్య భారత్ అభియాన్ ఆక్సెస్ ఇండియా కాంపైన్ ప్రోగ్రామ్ ను

## జిల్లాలో వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం : దివ్యాంగులు తమ అవసరాలు, మరియూ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు, ఆస్పత్రులకు వెళ్లేందుకు వీలుగా సంబంధిత ప్రాంతాలలో రాంప్, టాయ్లెట్‌లు, వాహనాల పార్కింగ్ తదితర పనులను చేపట్టే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సుగమ్య భారత్ అభియాన్ ఆక్సెస్ ఇండియా కాంపైన్ ప్రోగ్రామ్ ను జిల్లాలో వేగవంతం చేయాలని జిల్లా కలక్టర్ డా ఏ మల్లిఖార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజభిలిటీస్ ఆక్ట్-2016 (SIPDA) కార్యక్రమానికి సంబంధించి జీ వీ ఎం సి, ఏ పీ ఈ డబ్ల్యూ ఐ డి సి, ఏ పీ ఎస్ ఆర్ టీ సి, ఆర్ బి, ఏ పీ ఎం ఎస్ ఐ డీ సి మొదలైన ఐదు శాఖలు 38

తరువాయి 2లో..

## ఏపీ పర్యాటకానికి ప్రత్యేక యాప్

### మంత్రి అవంతి శ్రీనివాస్



అమరావతి: కరోనా వ్యాప్తితో పర్యాటక శాఖకు నష్టం వచ్చిందని మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో 13 చోట్ల 5 స్టార్ స్థాయి హెూటళ్లను నిర్మిస్తామని ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయి హెూటళ్లను నిర్మిస్తామని చెప్పారు. ప్రసాదం పథకం కింద శ్రీశైలంలో అభివృద్ధి చేశాం.. సింహాచలంలో

తరువాయి 2లో..






## పారిశుధ్య కార్మికులు 8 గంటలు పనిచేయాలి

### - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన



విశాఖపట్నం :-పారిశుధ్య కార్మికులు ఎనిమిది గంటలు పని చేయాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజారోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల చేత ఎనిమిది గంటల పని చేయించాలని ఇన్స్పెక్టర్లను ఆదేశించారు.

వార్డులలో పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వాటిని వెంటనే చర్యలు తీసుకొని, ఫిర్యాదులను సరైన సమాధానంతో ముగించాలని ఆదేశించారు. ప్రతి రోజు చెత్త తరలించే వాహనాలు వస్తున్నాయా అని ఆరా తీశారు. ప్రతి వాహనం రోజుకి మూడు ట్రిప్పులు తిరగాలని, చెత్తను యార్డ్ కు తీసుకొని వెళ్లినప్పుడు వాహనం వెంట పారిశుద్ధ కార్మికులు వెళ్లకుండా చూడాలని, ఆ సమయంలో పుష్ కార్టుతో డోర్ టు డోర్ చెత్త సేకరణకు వారిని పంపించాలని ఆదేశించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ, కాలువలు శుభ్రపరచుట ఒకే సారి చేయాలని, ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు చెత్త సేకరణ, స్వీపింగ్ చేయించాలని, మధ్యాహ్నం నుండి అద్దె కార్మికులతో కాలువలు, గెడ్డలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఎన్నిక చేయబడిన వార్డులలో యూజర్ చార్జీలు 10 రోజులలో 60 శాతం చార్జీలు వసూలు అయ్యేవిధంగా శ్రద్ధ చూపాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. అన్ని వార్డులలో యూజర్ చార్జీల వసూలు మొదలుపెట్టమని తెలిపారు. ఓ.డబ్ల్యూ.ఎం.ఎస్ స్కానింగ్ సరిగా నిర్వహించడం లేదని, సరిగా చేసే విధంగా దృష్టిసారించాలని ఆదేశించారు. ప్రతి వార్డు కు స్ప్రేయింగ్, ఫాగింగ్ మిషన్లు ఇవ్వడం జరుగుతుందని, ప్రతి రోజు వార్డులలో స్ప్రేయింగ్, ఫాగింగ్ జరిగే విధంగా చూడాలని, డెంగ్యూ కేసులు నమోదు అవకుండా చూడాలని, దోమలు వృద్ధి చెందకుండా అరికట్టడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి కే.ఎస్.ఎల్.జి.శాస్త్రి, ఎఎంఒహెచ్ లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకచవితి పూజలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలి

## - ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ డిమాండ్



గాజువాక : నియోజకవర్గం కన్వినర్ కర్ణంరెడ్డి నర్సింగరావు ఆద్వర్యంలో వినాయక చవితి మహోత్సవం జరుపుకునేందుకు అనుమతులు నిరాకరించిన రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా పాతగాజువాక లో దర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ,రాష్ట్ర బీజేపీ ప్రదాన కార్యదర్శి పివిఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాధవ్ మాట్లాడుతూ హిందువుల మనో భావలను దెబ్బతీసే విధంగా వైసీపీ ప్రభుత్వం మొండి వైఖరి నశించాలంటూ ధర్నా చేపట్టారు. వినాయక చవితి ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వా లన్నారు. వైసీపి ర్యాలీలకు, సభలకు అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా తీసుకున్న నిర్ణయం వెనుకకు తీసుకోవాలంటు డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి హిందూ ఆలయాలు మీద అనేక దాడులు జరిగాయని వైస్సార్ జయంతి కి వర్ధంతి కి లేని కోవిడ్ నిబంధనలు వినాయక ఉత్సవాలకి వర్తిస్తాయా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతి పెద్ద వినాయక విగ్రహాన్ని గాజువాకలో పెట్టేవారమని ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకపోవడం వలన ఆపవలసి వచ్చిందని భక్తులందరూ కరోన నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి పండగ చేసుకోవాలని అన్నారు. గాజువాక బీజేపి తరపున రేపు ఉదయం 11 గంటలకు పాత గాజువాక కూడలిలో 500 మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం పాతగాజువాక నుండి ర్యాలీ గా గాజువాక తహసీల్దార్ కార్యాలయం కి వెళ్లి డిప్యూటీ తహసీల్దారుకి వినతిపత్రం అందచేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపు మేరకు గాజువాకలో ఈ కార్యక్రమం నిర్వహించామని అని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు బాటా శ్రీను, పొలిమేర శ్రీను, గోలి శంకరరావు, సిరసపల్లి నూకరాజు, బొండా యల్లాజీరావు, టేకేటి పెంటయ్య, రోహిణి, పద్మావర్రి లలిత, పుష్పలత, గూటూరు శంకరరావు, ప్రసాద్ శర్మ, అప్పలరాజు,తాతారావు, సత్తిబాబు, పేర్ల అప్పారావు, కృష్ణంరాజు,బెన్నీ పైడిరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలను వినియోగిద్దాం...

- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం....
- సహాయ సంచాలకులు ఎల్. రమేష్



శ్రీకాకుళం : మట్టి వినాయక విగ్రహాలతోనే వినాయక చవితి పర్వదినాన్ని జరుపుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సమాచార శాఖ సహాయ సంచాలకులు ఎల్ రమేష్ జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు.బుధవారం ఉదయం ఆయన కార్యాలయంలో జై భారత్ ముద్రించిన పండగ పూట పాపం చేయడం ఎందుకు? గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, హానికర విష రసాయనాల రంగులు వినియోగించిన విగ్రహాలను వాడి పర్యావరణాన్ని పాడుచేయ వద్దని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మట్టి విగ్రహాలనే వినియోగించాలని పిలుపునిచ్చిన సంగతి విదితమేనని అన్నారు.

దైవం మెచ్చే రీతిలో, పుడమితల్లికి నచ్చే రీతిలో భక్తి పారవశ్యంతో గణేశుని అర్చిద్దామని ఆయన కోరారు. మట్టి వినాయక ప్రజలతోనే పూజిద్దామని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు. మట్టి వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే సమయంలో చెరువులు, నదులు కాలుష్యం నుండి రక్షింపబడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భారత్ సభ్యులు జి.వి నాగభూషణరావు ,కళ్యాణ చక్రవర్తి,రామారావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గీతం అడ్మిషన్ల సమాచారం

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ బైపిసి సబ్జెక్టులతో ఉత్తీర్ణత అయిన విద్యార్ధులకు బ్యాచులర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ (బిఇఎమ్), బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బిసిఎ), ఐదేళ్ల ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బిఎస్సీలో బయోకెమిస్ట్రి, మైక్రోబయాలజీ, బయె ఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ,ఫుడ్ టెక్నాలజీ కాంబినేషషన్‌లతో కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. అలాగే ఎంపిసి విద్యార్ధులకు మేథ్స్,పిజిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ కాంబినేషషన్‌లతో బిఎస్సీ డిగ్రీ కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారికి ఎమ్మెస్సీలో అప్లైడ్ మేథ్స్, ఫిజిక్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్ సైన్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బయోకెమిస్ట్రి, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

- గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ద్వారా నిర్వహిస్తున్న నాలుగు సంవత్సరాలు కాల వ్యవధి గల బిఎస్సీ నర్సింగ్ కోర్సుకు, రెండేళ్ళ కాలవ్యవధి గల ఎమ్మెస్సీ నర్స్ ప్రాక్టీషనర్ ఇన్ క్రిటికల్ కేర్ (ఎన్‌పిసిసి) కోర్సుకు 2021 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరుపుతున్నారు. బిఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్ మీడియట్‌లో బైపిసి కోర్సులో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి బిఎస్సీ నర్సింగ్ కోర్సులో 55 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబిఎ, బిబిఎ, బికామ్, కోర్సులలో 2021 విద్యాసంవత్సరం ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో బిబిఎ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, బిబిఎ ఫిన్‌టెక్, బిబిఎ లాగిస్టిక్స్, బిబిఎ ఫైనాన్స్‌యల్ మార్కెట్స్, బిబిఎ బిజినెస్ అనలటిక్స్, బిబిఎ ఎంట్రపైన్యూర్ కోర్సులను, అంతర్జాతీయ అకౌంటింగ్ సంస్థలు సీమా, ఎసిసిఎలతో కలసి చ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును, బికాం (ఆనర్స్) కోర్సును నిర్వహిస్తున్నారు.

గీతం స్కూల్ ఆఫ్ ఫిజియో థెరపీలో ఈ ఏడాది 2021 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా నాలుగేళ్ళ కాలవ్యవధి గల ఫిజియో థెరపీ కోర్సుకు అడ్మిషన్లు ప్రారంభించారు. ఇంటర్‌లో బయాలజీ, పిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్ధులు ఈ కోర్సుకు ధరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ ఏడాది జాతీయ స్థాయిలో జరిగే నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు లేదా గీతం ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రవేశాలు కల్పిస్తారు.

ఈ కోర్సులలో ప్రవేశానికి సంభందించి అర్హతలు, ఫీజల వివరాలు, ఆన్‌లైన్ ధరకాస్తులకు వెబ్ సైట్ ఩఩఩.ప్ర్ఋఎ.వ఩బ ను పరిశీలించవచ్చు.

# విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా మద్దిలపాలెంలో సీపీఎం ప్రదర్శన - రాస్తారోకో



మద్దిలపాలెం : 2014-15 సంవత్సరాల నుండి 2018-19 సంవత్సరం వరకు వినియోగించుకున్న విద్యుత్‌పై నేడు 3699 కోట్ల రూపాయల ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేస్తూ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయం తీసుకుంది. దీనికి వ్యతిరేకంగా సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం జంక్షన్‌లో నేషనల్ హైవేపై రాస్తారోకో నిర్వహించింది. దీనికి ముందు సిపిఎం కార్యాలయం నుండి హైవే వరకు ప్రదర్శనగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ ఇప్పటికే కరెంటు బిల్లుల్లో ప్రజలకు తెలియకుండానే ఈ భారాలు వేశారని అన్నారు. కరోనా కష్టాల్లో ఉన్న ప్రజలు ఒక వైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు, పన్నుల పెరిగిపోయి సతమతమవుతున్నారు. కేంద్ర విద్యుత్ చట్ట సవరణల నేపథ్యంలో అదనంగా ట్రూ అప్ ఛార్జీల భారం మోపడం సరైందిగాదన్నారు. ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలని, ఆ వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేసారు. విద్యత్ ప్రైవేటీకరణ చేయడంతో ఉత్పత్తి దగ్గర నుండి పంపిణీ వరకు అయ్యే ఖర్చును కూడా వినియోగదారులపై వేయడం దుర్మార్గమన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు వేయడానికి పూనుకుంటే నాడు ప్రతిపక్షంలో ఉన్న వైసిపి ప్రభుత్వం వ్యతిరేకించింది. గతంలో అద్దెకుండి వాడు వినియోగించిన కరెంటుకు ఇప్పుడు అద్దెకున్నవాళ్ళను కట్టమంటే ఎలా అని జగన్ నిలదీసారు. కానీ నేడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మోడీ ప్రభుత్వానికి మోకాలొడ్డి 2014 నుండి కరెంటు ఏ నెలలో ఎన్ని యూనిట్లు కాల్చామో అన్ని యూనిట్లకు 1.20 రూ?లు చొప్పున ట్రూ అప్ ఛార్జీలు వేయడం సరైంది కాదు. దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.కుమారి, దండునాగేశ్వరరావు, ఎం.చంటి, అనపర్తి అప్పారావు, ఎ.అప్పారావు, త్రినాధరావు, వి.తులసీరాం, ఎ.సింహాచలం, పి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మహిళ మృతదేహం



ఎస్.రాయవరం : పోలవరం కాలువ దార్లపూడి వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందనే డైల్ 100 సమాచారం పై ఎస్.రాయవరం పోలీసులు ఎస్ఐ శ్రీనివాస్ హెచ్.సి నరసింహారావు స్థానికుల సహాయంతో వరాహనది నుండి కొట్టుకొని వచ్చిన ఈ మహిళ మృతదేహం సుమారు 35 నుండి 40 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, పోలవరం కాలువ నుండి మంచానికి తాళ్ళు కట్టి మోసుకొని వచ్చి నక్కపల్లి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్న ఎస్. రాయవరం పోలీసులు.

# ఏపీలో కొత్తగా 1,361 కరోనా కేసులు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో కొత్తగా 1,361 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా,15 మంది కరోనా బారిన పడి మృతి చెందారు. గత 24 గంటల్లో వైరస్ నుంచి 1,288 మంది బాధితులు కోలుకోగా.. ఇప్పటివరకు 19,96,143 మంది బాధితులు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. రాష్ట్రంలో కరోనా కారణంగా మృతి చెందిన వారి సం?ఖ్య 13,950కు చేరింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 2,70,99,014 శాంపిల్స్‌ను పరీక్షించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ బుధవారం రోజున హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.

మొదటి పేజీ తరువాయి

## థర్డ్ వేవ్ సన్నద్ధతపై ప్రణాళిక సిద్ధం

ఈ పరీక్షలు అందుబాటులో ఉండాలి. అవసరమైన చోట సీహెచ్‌సీల్లో కూడా డయాలసిస్ యూనిట్లు అందుబాటులోకి తీసుకురావాలి. హెల్త్‌డేటాపై అన్నిరకాల చర్యలు తీసుకోవాలి. ఎక్కడ పరీక్షలు చేయించుకున్నా, ఎక్కడ చికిత్స తీసుకున్నా గుర్తింపు కార్డు ద్వారా ఆ వివరాలతో కూడిన డేటా అప్‌లోడ్ చేయాలి. ఒక వ్యక్తి వైద్యంకోసం ఎక్కడకు వెళ్లినా ఆ వివరాలు డాక్టర్‌కు వెంటనే అందుబాటులోకి వచ్చే విధానం ఉండాలి. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా, విలేజ్ క్లినిక్ నుంచి టీచింగ్ ఆస్పత్రి వరకూ ఎక్కడికి వెళ్లినా... అక్కడ చేయించుకున్న పరీక్షల వివరాలు, చికిత్స వివరాల డేటా అప్‌లోడ్ కావాలి. దీనికి సంబంధించి మంచి సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం జగన్ సూచించారు.

థర్డ్‌వేవ్ సమాచారం నేపథ్యంలో కోవిడ్ నియంత్రణకు నూతన చికిత్సా విధానాలపై దృష్టి సారించాలన్న సీఎం.. కొత్త మందులు, మెరుగైన ఫలితాలు, తక్కువ దుష్ప్రభావాలు ఉన్నవాటి వినియోగంపై దృష్టిపెట్టి అన్నిరకాలుగా సిద్ధం కావాలని తెలిపారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్(నాని), సీఎస్ ఆదిత్యనాథ్ దాస్, కోవిడ్ కమాండ్ కంట్రోల్ ఛైర్ పర్సన్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, 104 కాల్ సెంటర్ ఇంఛార్జ్ ఎ బాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, ఆరోగ్యశ్రీ సీఈఓ వి వినయ్ చంద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి మురళీధర్ రెడ్డి, పరిశ్రమలశాఖ డైరెక్టర్ జే వి యన్ సుబ్రమణ్యం, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## సుగమ్య భారత్ అభియాన్ ఆక్సెస్ ఇండియా కాంపైన్ ప్రోగ్రామ్ ను

# జిల్లాలో వేగవంతం చేయాలి

రకాల పనులను నిర్వర్తిస్తున్నాయని,వాటికి సంబంధించి రూ 1436.33 లక్షలు మంజూరు అయ్యాయన్నారు జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్న రాజు మాట్లాడుతూ తమ పరిధిలో 7 పనులు మంజూరు కాగా వాటిలో 6 పనులు పూర్తి చేయడం జరిగిందని,మిగిలిన ఒకటి 80% అయ్యిందని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఏపీఈ డబ్ల్యు ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం జగ్గారావు మాట్లాడుతూ తమకు కేటాయించిన పది పనులలో ఒకటి మాత్రమే పూర్తయిందని ,మిగిలిన కొన్ని టెండర్ ప్రక్రియ లోనూ వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసి డెప్యూటీ ఇంజనీర్ పీవీ నరసింహారావు మాట్లాడుతూ తమకు కేటాయించిన ఆరు పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు ఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్ సుధాకర్ మాట్లాడుతూ తమకు కేటాయించిన పది పనులు టెండర్ ప్రక్రియలోను ,వివిధ దశలలోను ఉన్నాయన్నారు. ఏ పీ ఎం ఎస్ ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిఎ నాయుడు మాట్లాడితూ అయిదు పనులకు సంబంధించి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ మొత్తం 38 పనులకు గాను 7 పనులను మాత్రమే పూర్తిచేయడం చాలా అలసత్వం గా ఉందన్నారు. వెంటనే టెండర్ ప్రక్రియను పదిహేను రోజుల్లో పూర్తి చేయాలని, నాణ్యమైన మెటీరియల్ నుఉపయోగించి పనులను వేగవంతం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో పనుల పురోగతి పై మరలా సమీక్షిస్తానని అప్పటికి ప్రోగ్రెస్ కనబడాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి అరుణ్ బాబు, డిజేబుల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి వి ఆర్ శర్మ పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయిలో రాణించేందుకే నూతన విద్యావిదానం

ఇటీవల నిర్వహించిన ద హిందూ ఎక్స్ లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో తన అభిప్రాయం వ్యక్తం చేసారని విజయసాయి రెడ్డి మరో ట్వీట్ లో పేర్కొన్నారు. పేద విద్యార్థులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు.

కోవిడ్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాన్నిస్తున్నాయని గతంలో పట్టణ ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఉన్న కోవిడ్ యాక్టివ్ కేసులు ప్రస్తుతం వందల సంఖ్యకు పరిమితమయ్యాయని ట్వీట్ లో పేర్కొన్నారు.రాష్ట్రంలో మెజారిటీ పట్టణాల్లో వందలోపే కేసులు ఉన్నాయని కేవలం నాలుగు నగరాల్లో మాత్రమే 200 కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కోవిడ్ నియంత్రణ చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ట్వీల్ లో పేర్కొన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ గ్రామీణ యోజన పథకం అమలులో నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాలు జాతీయ స్థాయిలో రెండు మూడు స్థానాలలో నిలిచాయని ఈ మేరకు శక్తివంచనలేకుండా కృషి చేసిన ఆయా జిల్లాల అధికార యంత్రాంగాలకు అభినందిస్తున్నట్లు విజయసాయి రెడ్డి ట్వీట్ లో పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెల్లాలని జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ను గర్వించే స్థాయిలో ఇలాగే నిలపాలని విజయసాయి రెడ్డి కోరారు..

# ఏపీ పర్యాటకానికి ప్రత్యేక యాప్

ఆ పథకం కింద రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తామని వివరించారు. పర్యాటన ప్రాంతాల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతామని పేర్కొన్నారు. స్థానిక పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్యాకేజిలు రూపొందిస్తామని వెల్లడించారు. సీ ప్లేన్స్ కూడా తీసుకొచ్చి విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నట్లు గుర్తుచేశారు. 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. పర్యాటక ప్రాంతాల్లో మద్యం ప్రోత్సహించాలన్నది తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కరోనాతో చనిపోయిన ఇద్దరు పర్యాటక కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబంలో వారికి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీస్కున్నట్లు మంత్రి శ్రీనివాస్ తెలిపారు. 36 పర్యాటక హెూటళ్లలో నిర్వహణ పర్యాటకులకు ఇబ్బంది లేకుండా చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నీళ్లు, ఆహారం వంటి సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అందమైన సముద్రం... అడవులు ఉన్నాయని, ఎకో టూరిజం అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో ఒక యాప్ తీసుకురాబోతున్నామని.. దసరాకు టూరిజం యాప్ సిద్ధమవుతుందని మంత్రి తెలిపారు. లోకల్ టూరిస్ట్‌లకు నాలుగు జోన్లుగా చేస్తున్నామని, జోన్‌కొక మేనేజర్ ఉంటాడని చెప్పారు.

# నూతన పంథాతో ముందుకు వెళ్లాలి

## జె.సి ఆర్.శ్రీరాములునాయుడు

శ్రీకాకుళం : నెహ్రూ యువ కేంద్రం అమలుచేస్తున్న యువజన కార్యక్రమాలు నూతన పంథాతో ముందుకు వెళ్లాలని సంయుక్త కలెక్టర్ ఆర్.శ్రీరాములు నాయుడు పేర్కొన్నారు. జిల్లా యువజన కార్యక్రమాల సలహా కమిటీ సమావేశం స్థానిక నెహ్రూ యువ కేంద్ర సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జె.సి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గ్రామ సచివాలయ వ్యవస్థలోని సిబ్బంది మరియు వాలంటరీ వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ యువజన కార్యక్రమాలు అమలుచేయాలని అన్నారు. తద్వారా గ్రామస్థాయిలో యువజన కార్యక్రమాలపై అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో ప్రతీ 50 గృహాలకు ఒక వాలంటీరు చొప్పున 950 మంది కి పైగా వాలంటీర్లు ఉన్నారని, వారితో సమన్వయం చేసుకోవడం వలన యువజన కార్యక్రమాల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని చెప్పారు. పాత పద్ధతిలోనే యువజన సంఘాలను ఏర్పాటుచేసుకొని వాటి నిర్వహణ కష్టతరంగా మారుతున్న ఈ తరుణంలో నెహ్రూ యువ కేంద్రం చేపట్టే కార్యక్రమాలు కూడా నూతన పంథాలో ముందుకు సాగాలని సూచించారు. ఈ విధంగా చేయడం వలన ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించగలరని చెప్పారు. యువజనులకు, మహిళలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు కూడా కేవలం జిల్లాకేంద్రానికే పరిమితం చేయకుండా గ్రామస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డిఆర్ డిఏ, సీడాప్, స్కిల్ డెవలప్ మెంట్, జిల్లా పరిశ్రమల కేంద్రం వంటి సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న యువజన, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని, యువజన, మహిళా సంఘాల సభ్యులతో యువజన కార్యక్రమాలు మరింత బాగా పనిచేసేందుకు కృషిచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ వంటి సంస్థల సమన్వయంతో యువజన కార్యక్రమాలు మరింత వేగవంతం చేయాలన్నారు. తద్వారా యువతలో అవగాహన పూర్తిస్థాయిలో కలిగి యువజన సంఘాలు బలోపేతం అయ్యేందుకు సహాయపడతాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యువ కేంద్రం సమన్వయకర్త జి.మహేశ్వరరావు, అకౌంటెంట్ డి.శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, సెట్ శ్రీ మేనేజర్ బి.వి.ప్రసాదరావు, రెడ్ క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, పలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎన్.సి.సి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంట్ జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్ ఆధ్వర్యంలో

## గణేశ మండపాల ఏర్పాటుకు పర్మిషన్ ఇవ్వాలంటూ ధర్నా




విశాఖపట్నం : ఎంవీపీ కాలనీ టీటీడీ కళ్యాణ మండపం వద్ద బుధవారం బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా మహిళ మోర్చా అధ్యక్షు రాలు ఉమ్మిడి సుజాత రాజ్ ఆధ్వర్యంలో గణపతి మండపాలను పెట్టవద్దని వైయస్.జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోని రద్దు చేసి గణేశ మండపాల ఏర్పాటుకు పర్మిషన్ ఇవ్వాలని ధర్నా చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెవైఎం కోశాధికారి దిలీప్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కలిగొట్ల సుబ్రహ్మణ్యం, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మురళీ మోహన్ రాజు, తూర్పు నియోజకవర్గ మండల అధ్యక్షులు శుభాన్, సాయి కృష్ణ, నాగరాజు, బిజేవైఎం.రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మంచి నాగ మల్లీశ్వరి, బిజెవైఎం తూర్పు సమన్వయకర్త ప్రసాద్ రాజు రుద్రరాజు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

### 33వవార్డులో స్వాతి ప్రమోటర్స్ వారి ఆధ్వర్యంలో

## ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా మట్టి వినాయకుని ప్రతిమలు, పూజా పుస్తకములు పంపిణీ




విశాఖపట్నం : 33వ వార్డు లో నీలమ్మవేపచెట్టు దగ్గర స్వాతి ప్రమోటర్స్ రమేష్ రెడ్డి మరియు వైయస్ఆర్‌సీపీ నాయకులు బోరా శ్రీనివాసరెడ్డి విజయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో మన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి వారి చేతుల మీదుగా మట్టి వినాయకుని ప్రతిమలను మరియు పూజా పుస్తకములు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డైనమిక్ లీడర్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి ప్రతిమ వినాయకుణ్ణి పంచి పెట్టడం మాకెంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి వార్డులోనూ ఈ మట్టి ప్రతిమ వినాయ కుడికి గణనీయంగా పూజలు అందించాలని, వినాయకుని కరుణ, కటాక్షాలు ప్రతి కుటుంబానికి ఉండాలని, గౌరవ ముఖ్యమంత్రి ఆసయలు మనస్ఫూర్తిగా నెరవేరాలని కోరుకున్నారు. 33 వ వార్డు వైసీపీ సీనియర్ నాయకులు అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి మధుబాబు, సీనియర్ నాయకులు అయ్యప్ప రెడ్డి, పోలవరపు దుర్గాప్రసాద్, సిహెచ్. శ్రీనివాసరెడ్డి, సీరపు ప్రసాద్, మహిళా నాయ కులు లక్ష్మీకాంతం, వై.అనూరాధ, వై.లక్ష్మీ, కె.సత్యవతి, కె.హేమలక్ష్మి, ఆశా వర్కర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల మీటింగ్ కి లేని కరోనా వినాయక చవితి వేడుకలకు వచ్చిందా

భీమునిపట్నం : కరోనా కారణం చెప్పి వినాయక చవితి వేడుకలను రద్దు చేయడం మంచి పద్ధతి కాదు తరతరాలనుంచి వస్తున్న సాంప్రదాయాన్ని కరోనా వంకతో ఈ ప్రభుత్వం ఇలా చేయడం ఎంత వరకు సమంజసమని జీవీఎంసీ ఫస్ట్ డివిజన్ టీడీపీ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు వందల వేల సంఖ్యలో జనాభా సేకరణ చేసి మీటింగ్ పెట్టుకోవచ్చు. షాపింగ్ మాల్స్ సినిమా హాల్లో ఓపెన్ చేయొచ్చు వీటన్నిటికీ లేని కరోనా హిందువుల ప్రథమ పూజ భావించే వినాయక ఉత్సవాలకి మాత్రమే కరోనా వ్యాప్తి చెందుతుంద అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఇప్పటికైనా ప్రభుత్వం హిందూ మనోభావాలు దెబ్బతినకుండా వినాయక చవితి ఉత్సవాల కి పర్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సమాజ్ వాది పార్టీ బలోపేతానికి చోడవరం నుంచి శ్రీకారం

### - ఉత్తరాంధ్ర ఇంచార్జ్ డా.నమ్మి అప్పలరాజు



**చోడవరంలో సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న సమాజ్ వాది పార్టీ ఉత్తరాంధ్ర ఇంఛార్జ్ డా.నమ్మి అప్పలరాజు**

చోడవరం : రాష్ట్రంలో సమాజ్ వాది పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇంచార్జ్ నమ్మి అప్పలరాజు అన్నారు. పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు అయినా స్వయంభు విగ్నేశ్వరుడు, స్వయంభూ గౌరీశ్వర స్వామి వార్లను బుధవారం దర్శించుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్ టి, బిసి బడుగు బలహీన వర్గాల ఉన్నతికి సమాజ్ వాది పార్టీ కట్టుబడి ఉందని, రాష్ట్ర పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తా అన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ, మండల, గ్రామాల వారిగా51 మందితో కమిటీ వేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ప్రతి గల్లీ నుండి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. అనంతరం స్థానిక సమాజ్ వాది పార్టీ నాయకులు పల్లా నూకరాజు చేయతలపెట్టిన చోడవరం నియోజకవర్గ సైకిల్ యాత్రను స్వయంభు విఘ్నేశ్వర స్వామి ఆలయం నుండి సమాజ్వాది పార్టీ జెండా ఊపి అప్పలరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## కొన్ని వేల మంది నిరుపేద ప్రజల ఆకలి తీరుస్తున్న అక్షయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయం సందర్శన



విశాఖపట్నం : 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం మరియు 30వ వార్డు సీనియర్ నాయకులు పెంటపల్లి సత్యనారయణ 30వ వార్డు ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాల రావు, 30వ వార్డు యూత్ ప్రెసిడెంట్ వడ్డాది దిలీప్‌కుమార్, వార్డు వైస్ ప్రెసిడెంట్ దశమంతుల చిని, మహిళా నాయకురాలు రాము. రోజు కొన్ని వేల మంది నిరుపేద ప్రజల ఆకలి తీరుస్తున్నా అక్షయ ఫౌండేషన్ స్వచందా సంస్థ ఐటి జంక్షన్ వద్ద ఉన్న కార్యాలయాన్ని సందర్శించారు.

అక్కడ వారు నిర్వహిస్తున్న విధుల్ని అడిగి తెలుసుకొని రోజు పంచే అహరని తిని వారిని అభినదించి, సంస్థ ప్రతినిధి అయి నటువంటి రాందాస్ గారిని మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువాలతో సన్మానం చేశారు.

## వినాయకచవితి ఉత్సవాలకు అనుమతివ్వాలి

### బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు



అచ్యుతాపురం : రాష్ట్ర ప్రజలు వేడుకగా జరుపుకునే వినాయకచవితి ఉత్సవాలకు అనుమతివ్వాలని యలమంచిలి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు కోరారు. బుధవారం వినాయకచవితి ఉత్సవాలకు అనుమతివ్వాలని కోరుతూ బిజెపి కన్వీనర్ రాజాన పార్టీ నాయకులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్ళి నిరసన తెలిపి తహశీల్దార్ కి, ఎస్ఐ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గొంతిన భక్త సాయిరాం, రాజాన రాజు, మేరుగు కాసుబాబు, అగ్గాల హనుమంతు, పల్లి రాజాబాబు, పీలా శ్రీను, యండపల్లి రాజు, కూండ్రపు సత్తిబాబు, అప్పలాసారి, కొవిరి యాదగిరి, కూండ్రపు కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

## తహశీల్ధార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పణ




భీమునిపట్నం : భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపు మేరకు గణపతి ఉత్సవాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా భారతీయ జనతాపార్టీ భీమిలి అర్బన్ మండలం ఆధ్వర్యంలో భీమిలి తహసీల్దార్ ఈశ్వరరావు కు వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గం కో ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ సంవత్సరం తరబడి విగ్రహాలను తయారు చేసి ఈ ఉత్సవాల సందర్భంగా ఆ విగ్రహాలను విక్రయించి వాటితో సంవత్సరం పాటు జీవనం సాగించే అనేక కుటుంబాలు ఉపాధిని కోల్పోతున్నాయని, అలాగే ఈ ఉత్సవాలు మతసామరస్యానికి జాతి ఐక్యతను సాటి చెపుతుందని, కాబట్టి ప్రభుత్వం యొక్క ఉత్తర్వులను సవరిరించుకోవాలని తహసీల్దార్ కు నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో లో జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి, రాష్ట్ర సాంస్కృతిక సెల్ కో కన్వీనర్ అయినాడ దుర్గాప్రసాద్, భీమిలి అర్బన్ మరియు తగరపు వలస మండల నాయకులు, బత్తిన వెంకటరమణ, బూర అశోక్ కుమార్, సారిక సన్యాసిరావు, రేఖ కరుణ రావు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ కు రు.కోటి విలువ చేసే వాహనాలు సీసీటీవీ కామెరాలు అందించనున్న హెచ్‌పీసీఎల్

### -హెచ్‌పీసీల్ పోలీసు శాఖ మధ్య జరిగిన ఒప్పందం



ములగాడ : పోలీసు శాఖ హెచ్ పీసీల్ ని 4 పెట్రోలింగ్ వ్యాన్లు, 2 ఎల్ ఇ డి తెరలున్న డిజిటల్ వ్యాన్లు, 1 ఆర్ .ఓ యూనిట్ ఇవ్వమని అభ్యర్ధించారు. హెచ్ పీసీల్ ఒక కోటి రూపాయిలు వీటి నిమిత్తం కేటాయించి సెప్టెంబర్ 8వ తేదీ బుధవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. హెచ్ పీసీల్ నుండి జెనెరల్ మేనేజర్ హెచ్ ఆర్ కే నాగేష్, పోలీస్ శాఖ నుంచి అడీషనల్ కమీషనర్ ఆఫ్ పోలీసు ఎం. రజని ఈ మేరకు ఒప్పందం పై సంతకాలు చేశారు. హెచ్ పీసీల్ సంస్థ ఈడీ వి.రతన్ రాజ్, పోలీస్ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా 20 సిసిటివి కెమెరాలను ఆన్ లైన్ లో ప్రారంభించారు.

ఈ కెమెరాలు మల్కాపురం పోలీసు స్టేషన్ నుండి శ్రీహరిపురం వరకు అమర్చబడ్డాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ హెచ్ పీసీల్ వారి ఉదారత ను ఉద్దేశ్యించి ఈ ఒప్పందం ప్రకారం ఇచ్చినవన్నీ పోలీసు వారికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. హెచ్ పీసీల్ సంస్థ ఈడీ వి.రతన్ రాజ్ పోలీసు శాఖ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. హెచ్ పీసీల్ జెనెరల్ మేనేజర్ - హెచ్ ఆర్ నగేష్, పీఆర్ఓ ఎం.కాళీ పోలీసు శాఖ నుంచి గౌతమీ శాలి, ఐపీఎస్, డిప్యూటీ కమి షనర్ శంకర్ నారాయణ, అడీషనల్ కమీషనర్, ఎస్ శిరీష, అసిస్టంట్ కమీషనర్ దుర్గా ప్రసాద్, సర్కల్ ఇన్స్పెక్టర్ ఇతర అధికారులు ఈ ప్రారంభోత్సవం లో పాల్గొన్నారు.

## బదిలిపై వెళ్లిన ఉపాధ్యాయినికి సత్కారం



అచ్యుతాపురం : మండలంలో మడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలిపై వెళ్లిన ప్రధానోపాధ్యాయినికి ఆ పాఠశాలలో బుధవారం సత్కార కార్యక్రమం నిర్వహించారు.

బదిలిపై వెళ్లిన ప్రధానో పాధ్యాయిని ప్రసన్న లక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోటూరు సంజీవి, మాజీ సర్పంచ్ శనివాడ జువ్వాల నాయుడు, వైసిపి నాయకులు తోట వెంకటేశ్, ఉప సర్పంచ్ చిన్ని గోవింద్, పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్ నారాయణరావు, పెద్దలు మోటూరు వెంకట రమణ, తోటి ఉపాధ్యాయులు తది తరులు ఉన్నారు.

## ఆక్సిజన్ అందక... శిశువు మృతి

విశాఖపట్నం : నెలలు నిండిన గర్భిణి పండంటి మగ శిశువుకు జన్మనిచ్చినా సకాలంలో ఆక్సిజన్ అందక బిడ్డ మృతి చెంది ఘటన పెద గంట్యాడలో కలకలం రేపింది.

బాధిత కుటుం బీకుల వివరాల బాలచెరువు ఉక్కు నిర్వాసిత కాలనీకి చెందిన సీహెచ్.సీతా మహాలక్ష్మి(22)కి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు పెదగంట్యాడ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు.

కడుపులో బిడ్డ మెడకు పేగు చుట్టుకున్నట్లు గుర్తించిన వైద్య సిబ్బంది... అతికష్టం మీద శిశువును బయటకు తీశారు.

## డెంగ్యూ జ్వరాలపై పలు జాగ్రత్తలు తీసుకోండి

### గ్రామ సభలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు



పరవాడ : పరవాడ గ్రామంలో పరవాడ గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు అధ్యక్షతన పంచాయితీ కార్యాలయంలో డెంగ్యూ వ్యాధి, ఇతర జ్వరాల నివారణ మరియు తీసుకోవలసిన జాగ్రత్తలుపై గ్రామ సభను భుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లతో పాటు వాతావరణ మార్పులు వలన సీజనల్ జ్వరాలు ఎక్కువగా ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వ్యాధి వర్షాకాలంలో అధికంగా వస్తుందని, మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా, పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, జ్వర లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా వైద్య పరీక్షలు చేయిపించుకోవాలని అన్నారు. ప్రజలకు ఈ వ్యాధులపై సరైన అవగాహన లేమి కారణంగా చాలా మంది వ్యాధి బారిన పడుతున్నారని, కావున వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ వాలంటీర్లకు అందరూ ప్రజలకు ఈ వ్యాధిపై సరైన అవగాహన కల్పించి, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడుల్ల, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు , సచివాలయం - 2 సెక్రెటరీ నీహారిక, 5 వ వార్డు మెంబెర్ పోతల అప్పలనాయుడు, 14 వ వార్డు మెంబెర్ సిరిపురపు రాజేష్, ఎఎన్ ఎమ్ సిబ్బంది రత్నం, ఇందిరా, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్స్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## స్కూల్ క్లస్టర్‌తో నాణ్యమైన విద్య

విద్యార్థుల చేరిక (ఎన్‌రోల్‌మెంట్) అనే సవాల్‌ను దేశంలో పాఠశాల విద్య ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్య క్షీణదిశగా పయనిస్తున్నది. చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, చేరిక సగానికి పడిపోయింది. ఇలా తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను సాధారణంగా తక్కువ ఎన్‌రోల్‌మెంట్ ఉన్న స్కూల్స్‌గా పరిగణిస్తున్నారు. ఇవి సాధారణంగా ఏకోపాధ్యాయ పాఠశాలలై ఉంటున్నాయి. ఈ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుడు అనేక బోధనేతర పనులతోపాటు, పాఠశాలలో ఉన్న తరగతులకు అన్ని సబ్జెక్టులు చెప్పాల్సి వస్తున్నది. దీనికి పరిష్కారం స్కూల్ క్లస్టర్ విధానమే అసలైన పరిష్కారం.

బోధన, బోధనేతర కార్యాచరణద్వారా విద్యార్థులు సమగ్రాభివృద్ధి సాధించేటట్లు చూడటమే విద్య అంతిమ లక్ష్యం. 1988 నుం చి విధాన పరంగా సెకండరీ స్కూల్ లెవల్ నుంచి వృత్తివిద్యకు ప్రాధాన్యమిచ్చారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితి ఏమంటే.. చాలా పాఠశాలలు కనీస సౌకర్యాల లేమి, వనరుల కొరతతో సతమతమవుతున్నాయి. ఆర్థిక వనరులే కాకుండా, మానవ వనరులు అంటే సరియైన ఉపాధ్యాయులు లేని పరిస్థితి కూడా ఉంటున్నది. ఇక చిత్రకళ, గేమ్స్-స్పోర్ట్స్, సంగీతం, క్రాఫ్ట్ లాంటి వాటి గురించి చెప్పేదేముంటుంది? వీటన్నింటికీ భౌతిక అవసరాలు ఆట వస్తువులు, గ్రంథాలయం, ప్రయోగశాల లాంటివి చాలా పాఠశాలల్లో అందుబాటులో లేవు. కొన్నిబడుల్లో ఇవి ఏదో మేర ఉన్నా.. వాటిని వినియోగంలోకి తెచ్చే విధంగా సక్రమ నిర్వహణ ఉండటం లేదు. ఇలాంటి సమస్యలన్నీ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవరోధాలుగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలోనే '2020- నూతన విద్యా విధానం' (ఎన్‌ఈపీ) సిఫారసుల్లో పాఠశాల విద్యకు సంబంధించి 'స్కూల్ కాంప్లెక్స్' లేదా 'స్కూల్ క్లస్టర్' విధానం గురించి నొక్కి చెప్పింది. ఈ విధానంలో సమీప పాఠశాలలను ఒక క్లస్టర్ లేదా గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. నిజానికి ఇది కొత్తదేమీ కాదు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ హయాంలోనే ఈ విధానాన్ని అనుసరించారు. స్వాతంత్ర్యానంతరం 1960లో కొఠారి కమిషన్ కూడా దీన్నే సూచించింది. ఈ క్లస్టర్ విధానాన్నే 1970ల్లో ప్రపంచ వ్యాప్తంగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియాల్లో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో అమలు చేశారు. సమీప పాఠశాలలను కలిపి ఒక 'కోర్ స్కూల్'గా ఏర్పడటాన్నే స్కూల్ క్లస్టర్ అనొచ్చని యునెస్కో దీన్ని నిర్వచించింది. ఒకే భౌగోళిక పరిసరాల్లో ఉన్న పాఠశాలలను ఒక గ్రూప్‌గా ఏర్పాటు చేస్తారు. వాటికి అవసరమైన భౌతిక, మానవ, ఆర్థిక వనరులను వినియోగించుకునేందుకు వీలుగా క్లస్టర్‌లుగా ఏర్పాటు చేస్తారు. దీంతో అవి నిర్వహణతో పాటు, ఉపాధ్యాయులను మార్చుకోవటంతో పాటు వనరులను పంచుకొంటాయి. వనరుల లేమి పరిస్థితుల్లో ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ విధానం ఫలితంగా.. ఉపాధ్యాయులను ఒక పాఠశాల నుంచి అవసరమైన మరో పాఠశాలకు వినియోగించుకోవటం, బోధనా ఉపకరణాలు పంచుకోవటం.. ఓ క్లస్టర్‌లో ఉన్న పాఠశాలలు సమిష్టిగా చేస్తాయి. దీని ద్వారా నిర్వహణాపరమైన సమస్యలను అధిగమించటమే కాకుం డా.. బోధనా పరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవటం, అభివృద్ధి చేసుకోవటం జరుగుతుంది. ఈ విధంగా ఒక ప్రాంతంలోని విద్యానైపుణ్యాలకు క్లస్టర్ కేంద్రంగా ఉపకరిస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పడిపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఏకీకృతం చేయటం, హేతుబద్ధీ కరించటం అనే విధానాన్ని అనుసరిస్తున్నాయి. తద్వారా ప్రాథమిక స్థాయిలో పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటం ప్రధాన కర్తవ్యంగా వ్యవహరిస్తు న్నాయి. పాఠశాలవిద్య వికేంద్రీకరణ ద్వారా వనరుల సమీకరణ, నైపుణ్యాలు పంచుకోవటం, సమర్థంగా వినియోగించు కోవటం లాంటివి సుసాధ్యం అవుతాయి.

విద్యార్థుల బహుముఖ ప్రజ్ఞ, క్రమశిక్షణ, సమగ్రాభివృద్ధి గురించి నూతన విద్యావిధానం-2020 నొక్కి చెప్పింది. దాంతో పాటు విద్యార్థుల ప్రత్యేక ప్రజ్ఞను గుర్తించి అభివృద్ధి చేయటానికి ప్రాధాన్యమిచ్చింది. విద్యాబోధన విద్యార్థి కేంద్రంగా సాగే ఓ సమగ్ర కార్యాచరణగా ఉండాలని అభిలషించారు. భాషా నైపుణ్యాలతో పాటు, గణితం, పరిసరాల విజానం గురించి బోధించటానికి తగువిధంగా టీచర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. అలాగే విద్యాసంస్థలు ఆయా సంస్థల్లో మానసిక నిపుణులు, సంఘసేవా కార్యకర్తల సహకారంతో విద్యార్థులు సమున్నతంగా ఎదిగే విధంగా కృషిచేయాల్సి ఉన్నది.

పరిమితమైన ప్రభుత్వ వనరుల నేపథ్యంలో పాఠశాలలకు అవసరమైన వసతులు, వనరుల కల్పన అసాధ్యంగా మారింది. ఈ పరిస్థితుల్లోనే స్కూల్ క్లస్టర్ విధానం ఎంతో ఉపయుక్తంగా మారింది. దీని ద్వారా అదనపు ఆర్థిక వనరుల అవసరం లేకుండానే సమస్యలను అధిగమించవచ్చు. ఉదాహరణకు.. ఒక పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడిని అవసరమైన పాఠశాలకు వినియోగించుకోవటం ద్వారా ఆర్థిక భారం సమస్యను పరిష్కరించుకోవచ్చు. అలాగే ఇతర ఉపాధ్యాయులను కూడా అవసరమైన చోట సద్వినియోగ పర్చుకొని విద్యార్థుల అవసరాలను తీరుస్తూ సమగ్రాభివృద్ధికి తోడ్పడవచ్చు.

## వినాయక మండపాలకు అనుమతి ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు డిమాండ్



కంచరపాలెం : వినాయక మండపాలకు అనుమతి ఇవ్వాలంటూ ఉత్తర నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేసారు. ఈమేరకు 24 , 25 వ వార్డు అధ్యక్షులు బాలకృష్ణ ఆధ్వర్యంలో సీతంపేట దుర్గా గణపతి ఆలయం వద్ద బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాలకు చర్చిలకు మసీదులకు వైయస్సార్ వర్ధంతికి లేని కోవిడ్ నిబంధనలు వినాయక మండపాలు కు మాత్రమే వచ్చాయా అంటూ మండి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి హిందూ వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటుంది అని హిందుత్వాన్ని హిందువుల మనోభావాలను అణగదొక్కే కార్యక్రమంలో భాగంగానే హిందువుల అన్ని కార్యక్రమాలలో మొదటి పూజ గా చేసుకునే గణపతి పూజలను అడ్డుకోవడం తగదన్నారు.

హిందువుల మనోభావాలను గౌరవిస్తూ అనుమతులు ఇవ్వాలని కోరారు . కార్యక్రమంలో పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి జగపతి రాజా బహదూర్ శివాజీ మండల ఇన్ చార్జ్ జిల్లా కార్యదర్శి ధానేష్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ బాబు గారు, జిల్లా కార్యదర్శి కొప్పిశెట్టి శంకర్రావు, నానాజీ, నానిరెడ్డి, లక్ష్మీనారాయణ, విజయ్, మోకిన సత్తిబాబు పలు డివిజన్ల మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువతికి తీవ్ర గాయాలు



కంచరపాలెం : జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువతికి తీవ్ర గాయాలయ్యాయి ప్రమాదానికి సంబందించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి . పెందుర్తి ప్రాంతానికి చెందిన జోస్నా ( 28 ) డి.ఆర్ .ఎం .ఓ కార్యలయంలో విదులు నిర్వహిస్తుంది . ఈక్రమంలో విధులకు హజరయ్యేందుకు బుదవారం 10 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై పెందుర్తి నుండి ఎన్ .ఏడీ మీదుగా తాటిచెట్ల పాలెం జాతీయ రహదారి మీదుగా వెళ్తుంది ఈక్రమంలో కప్పరాడ వద్దకి వచ్చేసరికి రహదారి మీద కుక్క అడ్డు రావడంతో ఒక్క సారిగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువతి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దింతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహన దారులు చికిత్స నిమిత్తం ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు .

## రెనాల్ట్ కైజర్ ఆర్ఎక్స్ టీ (ఓ), క్విడ్ ఎంవై21 కార్లు అవిష్కరణ




మర్రిపాలెం : రెనాల్ట్ పదో వార్షికోత్సవం సందర్భంగా బిర్లా కూడలి వద్ద నున్న హర్షా షోరూమ్ లో కైగర్ అర్ఎక్స్ టీ , క్విడ్ ఎంవై21 కార్లను ఆవిష్కరించారు. అంతకుముందు భీంసేన్ జ్యోతి ప్రజ్వల చేశారు. ఈ సందర్భంగా కస్టమర్ కేర్ హెడ్ రెనాల్ట్ ఇండియా భీంసేన్ గుల్బాని మాట్లడుతూ భారతదేశంలో కార్యకలాపాలు ప్రారంభించి పదేళ్ల అయిందన్నారు. 2021 నాటికి ఏడు లక్షల ఏబై వేలకు పైగా వినియోగదరరులను కలిగి ఉన్నామన్నారు. కైగర్ ఆర్ఎక్స్టీ (ఓ) ఎంటీ, ఎఎంటీ రెండు ట్రాన్స్ మిషన్లలో ఒక లీటర్ ఎనర్జీ ఇంజన్ తో లభ్యమౌతుందని, ఆర్ఎక్స్ జడ్ వేరియంట్లలో వినియోగదారుల ఆదరిస్తారని పేర్కొన్నారు. ట్రై - ఆక్టా ఎల్ ఈడీ ప్యూర్ విజన్ హెడ్ ల్యాంప్ 40 .64 సేం .మీ డైమెండ్ కట్ అలయ్ వీల్స్ వంటి సౌకర్యాలు సరికొత్త రెనో కైగర్ వేరియంట్ సొంతమన్నారు. కేబిన్లో చక్కని నాణ్యమైన గాలి ఉండేందుకు వీలుగా ఆర్ఎక్స్ టి (ఓ)లో ప్రత్యేకంగా పి.ఎం .2 .5 అడ్వాన్స్ పిల్టర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

స్మార్ట్ కేబిన్ అనుభూతిని పెంచి ప్రయాణికులు తమ స్మార్ట్ ఫోన్ తో కనెక్ట్ అయ్యేందుకు 20 .32 సెంటి మీటర్ల డిస్ ప్లే లింక్ ప్లోటింగ్ టచ్ స్క్రీన్లో వైర్ లెస్ స్మార్ట్ ఫోన్ రిప్లికేషన్ పంక్షన్ తదతర పీచర్స్ను రెనో కైగర్ "ఆర్ఎక్స్ టి (ఓ)లో పొందుపరిచామని తెలిపారు. భారత్లో దశాబ్ద కాల అనుబంధంలో ప్రపంచశ్రేణి తయారీ కేంద్రం, ప్రపంచస్థాయి టెక్నాలజీ సెంటర్, లాజిస్టిక్స్, డిజైన్ సెంటర్ సహ గణనీయమైన ప్రగతిని రెనో సాధించింది. బలమైన పునాదితో పాటు ప్రత్యేకమైన ప్రొడక్ట్ స్ట్రాటజీ, కస్టమర్ల సంపూర్ణ సంతృప్తి కోసం చేపట్టే చర్యలు ఈ మైలు రాయిని రెనో చేరుకునేలా చేశాయి. భారతదేశంలో 7,50,000 మంది కొనుగోలుదారులు రెనో కార్లు డ్రైవ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో సౌత్ - 2 రీజినల్ మేనేజర్, సేల్స్ మేనెజర్ గోపి బాబు, జనరల్ మేనేజర్ సేల్స్ అండ్ సర్వీస్, హర్ష ట్రేడింగ్ శ్రీనివాస్ భూపతి, హర్ష ట్రేడింగ్ ప్రయివేటు లిమిటెడ్ ఎండి ముప్పవరపు రాధా, డైరెక్టర్ ఎన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### 'అభ్యుదయ కిరణం - గురువు'

మనిషిని ఆదివాసి నుండి
అనంత లోకాలపై ఆధిపత్యానికి
సోపానాలు వేస్తూ
మానవ మేథోసంపత్తును
ఉన్నత శిఖరాలకు చేరుస్తున్న
ఒక వెలుగు కిరణం... గురువు
'విద్య ఒక తపస్సు
జీవితానికి అది... ఓ ఉషస్సు'
అన్న సూక్తిని నిజం చేస్తూ
అనుక్షణం శోధిస్తూ...
అనునిత్యం బోధిస్తూ...
విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి
శిష్యోన్నతే గురుదక్షిణగా భావించి
దిశ నిర్దేశనంలో దిక్సూచియైన
దైవ స్వరూపుడు
మా గురువర్యులు

...కవితా రచన
ఆర్.శంకర్

## పంచాంగం

మాసం : భాద్రపదం ; తిథి : తదియ రా.2.30; హస్త సా.5.22; వ.రా.12.58ల 2.29.

గురువారం 09-09-2021

**మేషం :** అంతరంగిక సమస్యలకు పరిష్కార మార్గం కానవస్తుంది. ముఖ్యుల రాకలు పెరుగుతాయి. ఆటోమొబైల్, ట్రాన్సుపోర్టు, మెకానికల్ రంగాలలోని వారికి చికాకులు తప్పవు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం :** బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఉద్యోగస్తులకు స్థానమార్పిడి, కొత్త బాధ్యతలు చేపట్టే ఆస్కారం ఉంది. రాజకీయ నాయకులు తరచు సభా సమావేశాలలో పాల్గొంటారు. బంధుమిత్రలతో పట్టింపులు ఎదుర్కొంటారు. ఉమ్మడి వ్యాపారం సౌమ్యంగా సాగుతుంది.

**మిథునం :**మీ పాత సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురవుతారు. కష్ట సమయంలో సన్నిహితులకు అండగా నిలుస్తారు. సోదరులతో సత్సంబంధాలు నెలకొంటాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆర్థిక విషయాలలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ముఖ్యుల సహకారం వలన సమసిపోతాయి.

**కర్కాటకం :** కళాకారులకు రచయితలకు, పత్రికా రంగంలోని వారికి పురోభివృద్ధి కానరాగలదు. అలౌకిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు తప్పవు. వస్త్ర, బంగారు, వెండి రంగాలలోని వారికి సంతృప్తి కానవస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది.

**సింహం :** ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి చికాకులు తప్పవు. శ్రమాధిక్యత వల్ల అస్వస్థతకు లోనవుతారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగాలలోని వారికి అనుకూలమైన కాలం. ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగుతుంది. స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరికొంత కాలం వాయిదా వేయడం మంచిది.

**కన్య :** నూతన దంపతులకు కొత్తకొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలకు సంబంధించిన వ్యవహారాలలో మెళకువ అవసరం. దైవ కార్య క్రమాల పట్ల ఏకాగ్రత వహిస్తారు. ప్రత్యర్థులతో రాజీ కుదురుతుంది. న్యాయవాదులు చికాకులు ఎదుర్కొంటారు. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

**తుల :** కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో చికాకులు తప్పవు. ధనం నిల్వ చేయాలనే మీ ఆలోచన ఫలించదు. ఉద్యోగస్తులకు బాధ్యతలు అధికం అవ్వడంతోపాటు, ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ఆపద సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. శత్రువులు మిత్రులుగా మారుతారు.

**వృశ్చికం :** స్త్రీలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించండి. బంధువుల రాక వల్ల మీ కార్యక్రమాల్లో అంతరాయం ఏర్పడుతుంది. వస్త్ర, బంగారు, వెండి వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. మీరు చేసే కృషి వల్ల మీ ప్రతిభ వెలుగులోకి వచ్చి మంచి విజయం సాధిస్తారు. నిరుద్యోగులకు ఆశాజనకం.

**ధనుస్సు :** చిన్నతరహా పరిశ్రమలలోని వారికి వృత్తులలోని వారికి సంతృప్తి కానవస్తుంది. మధ్యవర్తిత్వం వహించుటవల్ల మాటపడతారు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. భాగస్వాముల మధ్య మనస్పర్థలు తలెత్తినా సమసిపోగలవు. కమ్యూనికేషన్స్, ఏజెన్సీ రంగాలలో వారికి సంతృప్తి కానవస్తుంది.

**మకరం :**పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులే అనుకూలిస్తాయి. ప్రేమికులు ప్రతి విషయంలోనూ మితంగా వ్యవహరించడం క్షేమదాయకం. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం మంచిది. రాజకీయాలలోని వారు ప్రత్యర్థులు పెరుగుతున్నారని గమనించండి. నిర్మాణ పథకాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం :** ప్రింటింగ్ రంగాల వారికి శ్రమించిన కొలదీ ఆదాయం అన్నట్లుగా ఉంటుంది. ప్రయాణాల్లోను, వాహనం నడుపుతున్నపుడు మెళకువ వహించండి. ఇంటా బయటా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటారు. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. మీ సంతానం వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది.

**మీనం :** మీరు తలపెట్టిన పనిలో ప్రోత్సాహం లభిస్తుంది. పత్రికా రంగంలో వారికి పురోభివృద్ధి కానవస్తుంది. సోదరీ, సోదరుల మధ్య అవగాహన కుదరదు. స్త్రీలకు తల, కళ్లు, నరాలకు సంబంధించిన చికాకులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ప్రశంసలు అందుతాయి. మీ శ్రీమతి ఇచ్చిన సలహా పాటించడం మంచిది.

## భక్తి వాఙ్మయంలో భజగోవిందం

### సంకీర్తన



క్షణక్షణం మానవ జాతి యావత్తు అశాంతితో కొట్టుమిట్టాడు తోంది. స్వార్థము, మోహము, తృష్ణ, డంభములతో నడిచే మానవ జాతికి సత్సాంగత్యము, భగవద్భక్తి మొదలైన ఆర్షధర్మములే ప్రశాంతిని చేకూర్చగలవు. శంకర భగవత్పాదులు అందించిన భజగోవింద స్తుతి భక్తివాఙ్మయములో అద్వితీయ మైనది. ధార్మిక ప్రబోధము, విష్ణుభక్తి ప్రేరకముఅగు ఈ స్తుతికిగల భక్తిప్రచారము అనన్యసామాన్యము. దీనికి మోహముద్గరమని నామాంతరము కలదు. ఈ స్తుతి పండితులనుండి పామరుల వరకూ జీవన సత్యాన్ని బోధిస్తుంది. దీనిని పఠించుటవలన, అందలి సారాన్ని కొంతలోకొంతైనా ఆచరించిన జన్మ ధన్యత నొందగలదు. ఈ స్తుతి ఛందములోను, పద్య శిల్పము లోను, భావగౌరవములోను పదముల పొందికలోను అత్యంత రమణీయమైనది. శంకర భగవత్పాదులు అపర శంకరావతారం కారణజన్ములు. 32 సంవత్సరములే జీవించినా శంకరులు ఆనాటి సాంఘీక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతులను సమూలాగ్రంగా సమీక్షించి, భారత జాతిని ఒక్క త్రాటిపై తెచ్చిన ఘనత వీరికే చెందుతుంది. హిందూ మతస్థులందరికీ, అన్ని శాఖలవారికి అనువుగా స్తోత్రరాజాలను రచించిన ఘనత ప్రప్రథమంగా శంకరులకే చెందుతుంది. మూడు పర్యాయములు భారతదేశ సంపూర్ణ యాత్రచేసి అద్వైత తత్వాన్ని ప్రతిపాదించిన మహనీయులు శంకర భగవత్పాదులు. నాలుగు చెరగులా నాలుగు శంకరాచార్య పీఠాలను స్థాపించి ఆధ్యాత్మిక ప్రతిపత్తి కల్పించిన పరివ్రాజకుడు శ్రీ శంకర భగవత్పాదులు. ఒక విధంగా భారతీయ జీవన విధానాన్ని దిశానిర్దేశనం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ శంకర భగవత్పాదులు. అసలు భజగోవింద స్తుతి రచించటానికి ఒక వృద్ధుడు కారణభూతుడు. వ్యాకరణ పాఠాన్ని వల్లెవేయటంవలన ప్రయోజనం లేదని గోవిందుని భజించుటయే ముఖ్యమని, అదే మానవ జన్మకు తరుణోపాయమని భజగోవింద స్తుతిని అందించారు శంకర భగవత్పాదులు. మొదటి శ్లోకంలో భజగోవింద మూడుసార్లు అనటంలో పునరుక్తి దోషములేదనుట భాషాకోవిదుల అభిప్రాయం. విషయము అర్థమైన రీతిలో నివేదిం చటంలో ఔచిత్యమున్నది. మొదటిసారి దీక్షాగురువులు గోవింద పాదులవారిని స్మరించటం, రెండవసారి శ్రీమన్నారాయణు ని మూడవసారి తత్వభూతమైన స్వరూపాన్ని స్మరించారని వ్యాఖ్యానకారుల అభిప్రాయం. ఇక శ్లోకాల విషయానికి వస్తే అత్యాశలేని జీవితం. ఉన్నదానిలో సంతృప్తి చెందటం (మూఢ జహిహిధనాగమతృష్ణా), మోహాన్ని వదలి మానవీయంగా బ్రతుకుట నేర్చుకోవాలి (నారిస్తన భరనాభిదేశం), స్వజనులు వ్యవహరించేరీతి. మరణ సమయంలో భార్యాపిల్లలు భీతి చెందుట (యావత్పవనో నివసతిదేహే) వివరిస్తారు. అలాగే యదార్థతత్వాన్ని చింతన చేయాలి (కాతేకాన్తాకస్తే పుత్రః), నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం, జీవనముక్తి హేతువు (సత్సంగత్వే నిస్సంగత్వం)గా స్వీకరిస్తూ ధనవన గర్వాన్ని వీడి శాశ్వతతత్వాన్ని పొందే ప్రయత్నం చేయాలి. (మాకురువన గర్వ) సజ్జన సాంగత్యంతోనే జన్మతరిస్తుంది (కాతేకాన్తాధనగత చింతా), బహుకృత వేషాలతో జీవిత వలయంలో చిక్కుకొని సత్యదర్శనాన్ని పొందటంలేదు. (జటిలో ముండిలుంచితకేశః) అంతేగాదు జ్ఞానవిహీనునికి గంగాసాగర గమనం ముక్తినందించదని (కురుతే గంగాసాగర గమనం) సర్వసంగ పరిత్యాగికి సుఖానుభూతి సులభతరమని (యోగరతోవా భోగరతోవా), నేనెవరినని ప్రశ్నించుకుంటే సంసార స్వప్నతుల్యమని (కస్త్వంకో అహంకుత ఆయాతః) బోధపడుతుంది. సమచిత్తుడవైతేనే పరమాత్మను పొందగలవు. (త్వయిమయిచ అన్యత్రైకోవిష్ణుః), సమత్వభావన అలవరచుకుంటే (శత్రౌమిత్రౌపుత్రౌ బంధౌ), సో అహం తత్వాన్ని గ్రహించగలవు. (కామక్రోధంలోభం మోహం). అలాగే ధనార్జనవల్ల శుఖము కలుగదు (అర్థమనర్థం భావయ నిత్యం). చివరగా ప్రాణాయామం, జపతపాదుల వలన సత్యతత్వం బోధ పడుతుంది.

(ప్రాణాయామం ప్రత్యాహారం). గురువు నాశ్రయించిన వానికి పరమాత్మ దర్శనం సులభతరవౌతుంది. ఎటొచ్చి వాటిని ఆచరణాత్మకం చేసినపుడే వ్యక్తి సంస్కారవంతుడు కాగలడు. ఇటువంటి జీవన సత్యగుళికలని మనిషి పుట్టుకనుండి మరణం వరకు అన్ని ఇతివృత్తాలని తత్వవిచారంగా 32 ఏళ్ళ వయస్సులో రచించటం శంకర భగవద్పాదులు, అవతార పురుషులని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ శ్లోకాలను పఠించాలి, అందలి మూలార్థాన్ని స్వీకరించి మానవ జన్మను సార్థకత చేసుకోవాలి. శంకరాచార్య రచించిన కనకధారా స్తవము, సౌందర్య లహరి ఇత్యాది రచనలు దైనం దినంగా దీక్షాతత్పరులుగా పఠిస్తే సర్వకార్యసిద్ధి లభించుటయే గాక, మానసిక ప్రశాంతత సిద్ధించగలదు.

# 1792 కుటుంబాలను రోడ్డు మీదకు లాగితే ఊరుకునేది లేదు

## వెంటనే సి.ఆర్.టి లను విధుల్లోకి తీసుకోవాలి : మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ డిమాండ్





అనంతగిరి : అరకులోయ నియోజకవర్గం, విశాఖ ఏజెన్సీలో పని చేస్తున్న సి.ఆర్.టీ ఉపాధ్యాయులు సమస్యలపై పాడేరు ఐటీడీఏ ముందు ఆందోళన చేస్తుండగా ఆ దీక్ష కు సంఘీ భావం తెలిపిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఈ సందర్భంగా మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూలి రాష్ట్ర వ్యాప్తంగా 1792మంది సి.ఆర్.టీ లు సేవలు అందిస్తూనారని స్కూల్స్ రీ ఓపినింగ్స్ అయినప్పటికీ విధుల్లోకి తీసుకోకాపోవటం చాల దుర్మార్గమని 1792మంది కుటుంబాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విద్యార్ధులకు విద్యా భోధానాలు చెప్పే ఉపాధ్యాయుడు లేనప్పుడు నేటి బాలలే రేపటి భవి భారత పౌరులుగా ఎలా తీర్చి దిద్దుతారో అర్థం కావటం లేదని ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారనీ ఇప్పటికైనా సి.ఆర్.టీ లను నాడు తెలుగు దేశం పార్టీ హయాంలోనే జీతాలు పెంచటం జరిగిందని సి.ఆర్.టి ల కోసం ప్రభుత్వం ఏమి చేసిందో. సమాధానం చెప్పాలనీ సి.ఆర్.టిల సమస్యలు పరిష్కరనికీ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని లేదంటే ఉద్యమం తప్పదని లిమాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్లి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ దీక్షకు మద్దతుగా జేఏసీ నాయకులు రామారావు దొర, ఉపాధ్యాయ సంఘం నాయకులు పలసి కృష్ణారావు, గంగన్న పడాల్, దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, అరకు పార్లమెంట్ ఐటిడిపి కార్యదర్శి కూడా వెంకటరావు, మతం ఎంపీటీసీ అభ్యర్థి శశి భూషణ్ నాయుడు, త్రినాధ్, మహేష్, సి.ఆర్.టి లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

# హిందువుల పట్ల వైసీపీ ప్రభుత్వం వైఖరిని ఖండిస్తూ బీజేపీ నిరసన కార్యక్రమం




భీమునిపట్నం : విశాఖ పార్లమెంటు జిల్లా, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పద్మనాభం మండలం, రెడ్డి పల్లి గ్రామం లో విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు, కలిదిండి వసంత కుమార్ వర్మ, విశాఖ జిల్లా కిసాన్ మోర్చా, ప్రధాన కార్యదర్శి, పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ ఆధ్వర్యంలో హిందువుల పట్ల వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం వైఖరిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా, గ్రామ ప్రజలకు, గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు చేసుకోవాలని, అందరికీ మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో...

జిల్లా కిసాన్ మోర్చా, కార్యదర్శులు:- కలగల్ల పేర్రాజు, బుత్తల రాజు, గండి లక్ష్మి రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### తెలుగు రైతు ఉపాధ్యక్షులుగా

# గూనురు మల్లు నాయుడు ప్రమాణ స్వీకారం



చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనురు మల్లు నాయుడును రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు పదవి వరించింది. బుధవారం మంగళగిరి టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు సమక్షంలో మల్లు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్. రాజు, చోడవరం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎంపీపీ పెదబాబు, రోలుగుంట మండల పార్టీ అధ్యక్షులు గుమ్ములూరి చంద్రమౌళి, రావికమతం అధ్యక్షులు రాజానా కొండ నాయుడు, బుచ్చయ్య పేట అధ్యక్షులు కోటేశ్వరరావు, చోడవరం టౌన్ అధ్యక్షులు వెంకట అప్పారావు, చోడవరం మండల పార్టీ అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కనీ శెట్టి మత్స్య రాజు, అంబేరుపురం మాజీ సర్పంచ్ వేగి శ్రీను, విజయరామరాజుపేట మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్, రాయపు రాజుపేట సర్పంచ్ బొడ్డేడ రాము నాయుడు, లక్కవరం మాజీ సర్పంచ్ కర్రి కోటేశ్వర రావు, డొంకినా అప్పల నాయుడు, రొంగలి సోమినాయుడు, ముడుసు గోవిందా, మాదిరెడ్డి జోగి నాయుడు, కృష్ణమూర్తి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల వారి కోసం ప్రణాళికాబద్ధమైన మాస్టర్ ప్లాన్ తయారీ

వి.ఎం.ఆర్.డి.ఏ : విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వి.ఎం.ఆర్.డి.ఏ) చే రూపొందించబడిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ -2041 మరియు డ్రాఫ్ట్ ప్రోస్పెక్టివ్ ప్లాన్ -2051 నిమిత్తమై 16 వేల అభ్యంతరాలు దాఖలు కాబడ్డాయని, ప్రతియొక్క అభ్యంత్రని కులంకుషంగా పరిశీలించిన పిమ్మట తగుచర్యలు తీసుకోనుడతాయని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.వెంకట రమణారెడ్డి, ఐ.ఏ.ఎస్., వారు తెలిపారు. ఎవ్వరికి ఎటువంటి అన్యాయం జరగకుండా తగు రీతిలో మాస్టర్ ప్లాన్ తయారీ చేయబడుతుందని ముఖ్యముగా ఎవ్వరు మధ్యవర్తులను ఆశ్రయించవొద్దని కోరారు. చట్ట ప్రకారం నిశితంగా పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోనబడుతుందని తెలిపారు. ప్రతిపాదిత ఎంపీ రోడ్లు విషయమై విఎంఆర్డీఏ అప్రూవల్ లేఔట్లలో ప్లాట్లకు ఇబ్బంది కలగకుండా మరియు భూమి మీద లభ్యముగా ఉన్న పెద్ద రహదారులను కలుపుకుంటూ రోడ్ నెట్వర్క్ ను సమీక్షించడం జరుగుతున్నది. ప్రజా ఉపయోగ స్థలాలను ప్రభుత్వ భూమిలోకి మార్చుటకు ప్రతిపాదించడమైనదని, జీరోయితి భూమిలలో ప్రతిపాదించిన పార్కులు మరియు ప్రజాఉపయోగ సౌకర్యాలను దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూమిలోకి ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ వినియోగ మార్పు మరియు రహదారి తీసివేత విషయంలో ఎటువంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా, సదరు సందేహాల నివృత్తి కై ప్రతిరోజూ 4 పీఎం నుంచి 5 పీఎం మధ్యలో విఎంఆర్డిఏ కార్యాలయము సందర్శించి సందేహాలను నివృత్తి చేసుకోవలసిందని తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు వారియొక్క అమూల్యమైన సలహాలు, సూచనలు మరియు అభ్యంతరములు తెలియజేసినందుకుగాను, భవిష్యత్ తరాల వారికోసం ప్రణాళికా బద్ధమైన మాస్టర్ ప్లాన్ తయారీ లో భాగస్వామ్యం అయినందుకుగాను కృతజ్ఞత తెలిపారు.

# నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



అచ్యుతాపురం : నాటుసార తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్ ఫోర్సుమెంట్ బ్యూరో యలమంచిలి సీఐ జె. జనార్ధన రావు తెలిపారు.

బుధవారం రాంబిల్లి మండలం ధార బోగాపురం గ్రామంలో నాటుసార తరలిస్తున్న నేబర్తి పైడి నాయుడు నుండి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సి హెచ్ రాజేష్, సిబ్బంది ఉన్నారు.

# కొవ్వొత్తులు పంచుతూ నిరసన



కాకినాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పార్లమెంటు తెలుగుదేశం ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి ఆనంతలక్ష్మి సత్తిబాబు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి,షాపులకు వెళ్లి బుధవారం కొవ్వొత్తులు పంపిణీ చేశారు. విద్యుత్ భారం తగ్గించుకునేందుకు కరెంటు వాడకం మానేసి పూర్వపు రోజుల తరహాలో కొవ్వొత్తులు వెలిగించుకుందామని మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి సత్తిబాబు ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారం అందరినీ ఆకట్టుకుంది.

### వ్యవసాయ ఉద్యాన మరియు పశు వైద్య డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు

## దరఖాస్తు గడువు ఈ నెల 13 వరకు పొడిగింపు

పెద్దాపురం : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు పరిధిలోని వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానము, వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ లకు, డా. వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్న గూడెం పరిధి లోని ఉద్యాన పాలిటెక్నిక్ లకు మరియు శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం, తిరుపతి పరిధి లోని పశుపోషణ మరియు మత్స్యశాస్త్ర పాలిటెక్నిక్ లకు 2021-22 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ తుది గడువును 13.09.2021 వరకు పొడిగించడమైనది . ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్సైట్ లో ఈ నెల 13 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడును. ప్రవేశం కోరు ఔసాహికులైన అభ్యర్థులు దరఖాస్తు సమర్పణ మరియు ఆన్ లైన్ వెబ్ కౌన్సెలింగ్ తదితర వివరాల కొరకు www.angrau.ac.in వెబ్సైట్ ను సందర్శించవలసినదిగా కోరడమైనది.

### ప్రాణాంతకమైన న్యూమోనియా బారిన

# పిల్లలు పడకుండా ఉండేందుకు

## సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం



పెద్దాపురం : ప్రాణాంతకమైన న్యూమోనియా బారిన పిల్లలు పడకుండా ఉండేందుకు సార్వత్రిక వ్యాధినిరోధక టీకా కార్యక్రమం క్రింద న్యూ మోకోకల్ కాంజుగేట్ పి సి వి వ్యాక్సిన్ ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని పులిమేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాంబాబు నాయక్ వెల్లడించారు. బుధవారం మండలంలోని పులిమేరు పిహెచ్సి నందు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆదేశాల మేరకు పిసివి టీకా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య భద్రతకు తల్లి దండ్రులు ఈ టీకాను వేయించాలని తెలిపారు. ఎంతో ఖరీదైన ఈ వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. ఈ టీకా వ్యాక్సిన్ ద్వారా పిల్లలకు న్యూమోనియా నివారణ తో పాటు న్యూమోనియా తో వచ్చే జబ్బులు దరిచేరవని తెలిపారు.

ఈ కార్య క్రమంలో...

డాక్టర్ ఏ. అనూష, పులిమేరు గ్రామం పెద్దలు బి.గుర్రాజు, టి.అచ్యుతరామయ్య ,ఎస్ రాజు మరియు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల పై

# భౌతిక దాడులు హేయమైన చర్య

## ఎపిఎంటిఎఫ్ విశాఖ జిల్లా యూనిట్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమర్ నాథ్

భీమునిపట్నం : విశాఖ జిల్లా ఎపిఎంటిఎఫ్ యూనిట్ అధ్యక్షులు పివిఎస్ చంద్రరావు ఆధ్వర్యం లో స్థానిక బి ఆర్ అంబేద్కర్ జీ వి ఎం సి ప్రాథమిక పాఠశాల చిట్టివలస లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో ఎపి ఎంటిఎఫ్ విశాఖ జిల్లా యూనిట్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ అమర్ నాథ్ మాట్లాడుతూ పాఠశాల పనివేళలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల పై భౌతిక దాడులను ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండి స్తోందని ఉపాధ్యాయులు ఏ మైన. తప్పులు చేసి ఉంటే వారి పై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గానీ పాఠశాల తనిఖీ అధికారులకు గానీ విద్యాశాఖకు సంబంధించిన ఉన్నత అధికారులకు గానీ పిర్యాదు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవడానికి ప్రయత్నం చేయాలి గానీ పాటశాల పని వేళలలో వచ్చి విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై ఇష్టాను సారంగా గ్రామస్థులు దాడి చేయడం హేయమైన చర్యగా భావించవలసి ఉంటుందని ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులకు వారి ఆత్మ రక్షణ కొరకు ఎలాంటి చర్యలు చేశారో అదే తరహా లో పాటశాల పని వేళలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు కూడా అలాంటి రక్షణ చట్టాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఉపాధ్యాయుల పక్షాణ విన్నవించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్య వర్గ సభ్యులకు తెలియజేశారు.

ఈ సమావేశంలో....

వర్కింగ్ ప్రెసిడెంట్ వై వి రవి కుమార్ , వై ప్రతాప్ సింగ్ ,జీ దుర్గా ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నైముద్దిన్ ఎన్. జగదీష్, పి.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఎంఎస్ఎంఇ డైరెక్టర్ నదియా కు

# అభినందనలు వెల్లువ



పరవాడ : ఇటీవలే ఎంఎస్ ఎంఇ డైరక్టర్ గా నూతనంగా నియమించబడిన తాడి గ్రామానికి చెందిన శీలం నధియాను విసి ప్రసాద్ రెడ్డి అభినందించారు.

బుధవారం నదియా విసి ప్రసాద్ రెడ్డిని పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వ కంగా కలిశారు.

అనంతరము విసి ప్రసాద్ రెడ్డి ఎంఎస్ ఎంఇ డైరక్టర్ గా నియ మితులైన నధియాను దుశాలు వాతో సత్కరించి అభినందించారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నతస్థాయికి ఎదుగాలానీ అకాక్షించారు.

### జి.రాగంపేట జగనన్న ఇళ్ళ పథకంపై

## సమగ్ర విచారాణ జరపాలి : సీపీఎం డిమాండ్

పెద్దాపురం : పెద్దాపురం మండలం జి.రాగంపేట ప్రజలకు ఇచ్చిన జగనన్న ఇళ్ళ స్థలాలపై సమగ్రవిచారణ జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించాలని సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు డిమాండ్ చేసారు. ఎంతో ప్రాధాన్యతగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన జగనన్న ఇళ్ళ పథకం ఇళ్ళు ప్రారంభించారని కానీ పెద్దాపురం మండల జి.రాగంపేట ఇళ్ళు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మండల, డివిజన్ స్థాయి అధికారుల పక్కనే స్థలం ఉన్నా దానిని గాలికి ఎందుకు వదిలేసారని అన్నారు. అనేక మంది ఇళ్ళ స్థలాల కోసం ఇప్పటికి తిరుగుతున్నారని అన్నారు. పెద్దాపురం ఆనుకొని ఉన్న స్థలంలో ఇచ్చిన ఇళ్ళ స్థలాలు అవకతవకలు జరిగాయని రెవిన్యూ అధికారులు ప్రకటించారని కానీ అవి నేటి వరకూ ఎందుకు బయటపెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేసారు. 19 మంది అనర్హులని తేల్చారిన వారిని గుర్తించి ఇళ్ళ స్థలాలు ఇచ్చిన అధికారులపై, రాజకీయ నాయుకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయ వత్తిడిలా లేక అధికారుల నిర్లక్ష్యమా అనేది జిల్లా అధికారులు నిగ్గు తేల్చా లని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరప డం, వెంటనే లబ్దదారులు ఇళ్ళు కట్టుకోడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పాడేరు బివివికె పాఠశాలలో
# యజమాన్యం ఎంత ఫీజు అడిగితే అంత కట్టాల్సిందే

- విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు
- హైకోర్టు ఆదేశాలు బేఖాతారు
- బిఏఎస్ విద్యార్థులకు బలవంతంగా టీసీలు పంపిణీ
- టీసీకి రూ/- 500 వసూలు
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం








పాడేరు: విశాఖ ఏజెన్సీలో ప్రైవేట్ పాఠశాలాల దందాలు రోజురోజుకి మితిమీరి పోతుంది. హైకోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా దందా లే ధ్యేయంగా పెట్టుకుని ముక్కు పిండి విద్యార్థినీ, విద్యార్థుల, తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలోఫీజులు వసూళ్లకుప్రైవేట్విద్యాసంస్థలుపాల్పడుతున్నాయి.అంతే కాకుండా. వీరి తప్పులు కప్పిపుచ్చుకునేందుకే తెలివిగా విద్యార్థులతల్లిదండ్రులనుండి మాపిల్లలచదువులు మధ్య లో ఆగిపోకుండా మేమే డబ్బులు చెల్లించాలని నిర్ణయం తీసుకుంటామని వ్రాత పూర్వకంగావ్రాఇంచుకొన్నారు.ఇందుకుసంబంధించినవివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు మండలకేంద్రంలోపేరుగాంచినప్రముఖ విద్య సంస్థ అయినా భారతీయ విద్యా వికాస కేంద్రం(బివివికె) పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ పథకం క్రింద గిరిజన విద్యార్థిని విద్యార్థులు చదువుతున్న విషయం పాఠకులకు తెలిసిందే.. అయితే ఈ పథకాన్ని 2019-2020విద్య సంవత్సరం నుండి ఈ ప్రభుత్వం తాత్కాలికంగా రద్దు అ స్థానంలోఅమ్మ ఒడి పథకం అమలుచేస్తూ ఉత్తర్వులు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఉన్నట్టుండి ఈపథకం ఎత్తివేయడంతో గిరిజన విద్యార్థుల భవిష్యత్అయ్యోమయం అగమ్యగోచరంగా మారింది. దీంతో ఏమి చెయ్యాలో అర్థం కాని పరిస్థితిఏర్పడింది..దీనికిసవాల్ చేస్తూ విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించడం, వెంటనే న్యాయం చేయాలని,తమ పిల్లలు అయ్యా పాఠశాలలో చదువుకోవడానికి హై కోర్టు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వనికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పిటీషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపించగా హైకోర్టు స్టేటస్కో ఉత్తర్వులు జారీ చేస్తూ ఉత్తమ పాఠశాల పథకం క్రింద చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు యద విధిగాకొనసాగిస్తూ హైకోర్టు స్టేటస్కోసర్క్యులర్నుగిరిజనసంక్షేమశాఖఅధికారులు,రాష్ట్రప్రభుత్వానికిజారీచేసింది.దింతో పాఠశాలయాజమాన్యానికివిద్యశాఖఅధికారులుబలవంతంగా విద్యార్థులకు టీసీలు ఇవ్వడం గానీ, వారిచేత ఫీజులు కట్టించుకోవడం గానీ, చేయకూడదని (అట్లా జరుగుతునట్లు తెలిస్తే) పాల్పడితే కఠినంగా ఆ పాఠశాలాల మీద చర్యలు తీసుకొంటామనిహెచ్చరించారు.కోర్టు ఆదేశాలు స్పష్టంగా వేలువరించి ఉన్నపటికీ ఆ సర్కులర్ ని బేఖాతర్ చేస్తూ పాడేరులో బి వివికె పాఠశాల యజమాన్యం అక్రమ వసూళ్లకు పాల్పడుతుంది.అంతే కాకుండా బయటికి పొక్కకు%శీ%డా చాలాజాగ్రత్తలు తీసుకున్నారు. కొంతమంది తల్లిదండ్రులు డబ్బులు కట్టలేక చదివించే స్తోమత లేక పాఠశాల యాజమాన్యం తో తమ గోడు విన్నవించు కున్నారు. ఏ మాత్రం దయ దక్షిణం చూపకుండా.. టిసి కావాలంటే. డబ్బులు కట్టు. లేదా. టిసి ఇవ్వడం కుదరదని తెగేస్తూ చెప్పారు.. గత్యంతరం లేక వీరంతా మీడియా దృష్టికి తీసుకువచ్చారు.. అ పాఠశాల కు మీడియా వెళ్లి చూస్తే ఆసక్తి కరమైన విషయాలుఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. మీడియా జరిగేదంతా చిత్రీకరణ చేస్తున్న భయపడకుండా గుమస్తా తన పని తాను కొరుకుంటుపోయాడు. కొంతమంది తల్లిదండ్రులు మీడియా ముందు ప్రిన్సిపాల్ గొడవలు పడుతున్న.. దురుసుగా వ్యహరిస్తూ బుకాయించే ప్రయత్నం చేశారు. అయితే పాఠశాలలో క్లర్క్ (గుమస్తా ) ఉద్యోగం గత రెండు సంవత్సరాల కాలం నుండి ఖాళీగా ఉండడం వలన టిసి రికార్డ్ సీటును ఇచ్చే పని వైస్ ప్రిన్సిపాల్ సిద్ధబత్తుల. ప్రసాద్కు అప్పగించినట్లు తెలిసింది. ఇదే అదనుగా భావించి విద్యార్థిని తల్లిదండ్రులనుండి అక్రమావాసులకు పాల్పడుతున్నాడు. గతంలోనే కొంతమంది తల్లిదండ్రులకు ఎనిమిది వేల రూపాయలు ఫీజులు చెల్లించాలని చెప్పగా కొంతమంది తల్లిదండ్రులు 2 వేల రూపాయలు ఫీజులు చెల్లించినట్లు.మీడియా దృష్టికి తీసుకు వచ్చారు. కొంతమంది మూడు వేలనుండి, నాలుగు వేల రూపాయలు తీసుకురాగా నిరాకరించారని తెలిపారు.దీంతో విషయంబయటికి పొక్కింది.

గుమస్తా వివరణ: పాఠశాల యాజమాన్యం చెప్పిందే నేను చేసాను. నా సొంత నిర్ణయం కాదని. ఇప్పటికి25మందికు టిసి లు ఇచ్చామని వారిచ్చిన సొమ్ము యాజమాన్యనికి చెల్లించానని వివరణ ఇచ్చారు.

**ప్రిన్సిపాల్ వివరణ** : పాఠశాల నిర్వహణ, సిబ్బంది జీతాలు ఎక్కడ నుంచి ఇవ్వాలి..? బిఏఎస్ విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపూర్వకంగా నే వ్రాసి ఇచ్చి పీజులు కడుతున్నారని, మేము ఎవ్వరి వద్ద బలవంతంగా గుంజు కోవడం లేదని అన్నారు.. తల్లిదండ్రులు చెప్పేది వాస్తవం కాదా..?అని మీడియా ప్రశ్నిస్తే.. వారికి పని పాటు లేకే మీ ముందు అలా మాట్లాడుతూ న్నారని అన్నారు.

అయితే. గుమస్తా సొమ్మంతా మీకే జమ చేస్తున్నానని చేపారుగా దానికి మీరు ఏమంటారనిఅడిగితే నాకు ఈ విషయం తెలియనే తెలియదని, గుమస్తా అక్రమాలకు పాల్పడినట్లు మీరు చెప్పితే గాని నాకు తెలియదని వివారణ ఇచ్చారు. ఇలా ఇద్దరు(ప్రిన్సిపాల్, గుమస్తా) పొంతన లేని మాటలతో మీడియాకె బురిడీ కొట్టిస్తూ అక్రమ.పీజు వాసులకు పాల్పడుతుబయట పడ్డారు. ఈ పాఠశాల యాజమాన్యం పై కఠినంగా శిక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## వైద్యులు తమ నైపుణ్యత చాటుకున్నారు



భీమునిపట్నం : జివియంసి రెండవ వార్డ్ సంగివలస ఎన్ ఆర్ ఐ వైద్యులు తమ నైపుణ్యతను చాటుకున్నారు, సంగివలస అనిల్ నీరుకొండ (ఎన్ఆర్ఐ) ఆసు పత్రిలో రెండు రోజుల శిశువుకు అరుదైన శస్త్రచికిత్స చేసి వైద్యుల పనితనాన్ని చాటి చెప్పారు. లక్ష మందిలో ఒకరికి సోకే కాంజీ నైటిల్ డిష్ లోకేషన్ అనే వ్యాధితో జన్మించిన శిశువుకు అతితక్కువ ఖర్చుతో డాక్టర్ అజీజ్, సూరజ్ వర్మ, జగన్ మోహన్, మరియు డాక్టర్ లలిత వద్యా, ఎన్.శ్రీవిద్య, కె.శ్రీవిద్య తది తరులు శస్త్రచికిత్స చేసి శిశువుకు అంగవైకల్యం రాకుండా కాపాడారు, వైద్యులను స్థానికులు, ఆసుపత్రి యాజమాన్యం అభి నందనలు తెలియజేశారు.

## గణేశ నవరాత్రుల నిర్వహణ కు రాష్ట్ర ప్రభుత్వం
## వెంటనే అనుమతులు జారీ చేయాలి

ములగాడ : హిందూ ధర్మ పరి రక్షణకు, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న హిందూ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర బిజెపి పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు, విశాఖ వెస్ట్ అసెంబ్లీ ములగాడ మండలం పరిధి శ్రీహరిపురం, మల్కాపురం బీజేపీ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో గాజువాక డిపో దగ్గర నుండి ములగాడ ఎమ్మార్వో కార్యాలయం వరకు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ములగాడ మండలం తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్లకు, వైకాపా కార్యకలాపాలకు, షాపింగ్ మహల్ కు, సినిమా హాల్ లకు,మద్యం షాప్ లకు లేని కోవిడ్ నిభందనలు వినాయక చవితి పండుగ నిర్వహణ కు ఎందుకు అని రాష్ట్ర ప్రభుత్వం పై మండి పడ్డారు. ఇది కేవలం హిందువుల మనో భావాలను దెబ్బతీయడానికి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన ఈ

కార్యక్రమంలో బీజేపీ నేతలు పిఎస్ఆర్,

విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి , రాష్ట్ర ఎస్సి మోర్చా నాయకులు కె వి బాబు,ఎం ప్రకాష్ , మండలాధ్యక్షులు లెక్కల రామకృష్ణ, 61వార్డ్ బీజేపీ అధ్యక్షులు పంచదార్ల అప్పలరాజు, చుక్క లతీష్ రెడ్డి సీనియర్ నాయకులు గుప్తా కొలూరు గురుమూర్తి, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు దేముడు మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కింతాడ వసుంధర ,మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు భువనేశ్వరి పి. హరిత, చింతకాయల సురేష్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎంసెట్ ఫలితాల లో
## శశి విద్యాసంస్థ విద్యార్థుల ప్రతిభ



భీమునిపట్నం : బుధవారం ప్రకటించిన ఎంసెట్ ఫలితాలలో సంగివలస లో ఉన్న శశి విద్యాసంస్థ విద్యార్థులు అత్యు త్తమ ర్యాంకులు సాధించారని శశి విద్యాసంస్థ ల చైర్మన్ బూరుగు పల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. స్టేట్ 128 వ ర్యాంకు కె సాయి మానస వీణ ,232 వ ర్యాంక్ కె ఎల్ ఎన్ జస్వంత్ ,623 వ ర్యాంక్ పి గౌతమ్ కుమార్ ,705 వ ర్యాంక్ వి ఆకాష్ ,769 వ ర్యాంక్ ఎస్ రాహుల్ ,825 వ ర్యాంక్ వై హరిణి,1009 వ ర్యాంక్ డి ప్రశాంత్ లు ర్యాంకులు సాధించారు.ఈ ర్యాంకర్ల ను శశి విద్యాసంస్థ వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, కరెస్పాడెంట్ క్రాంతి సుధ అభినందనల తెలిపారు.

### ఎమ్మెల్యే ధర్మశ్రీ చేతులమీదుగా గణపతి నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చోడవరం : రాష్ట్రంలో మరో కానిపాకం గా విరాజిల్లుతున్న చోడవరం స్వయంభు విఘ్నేశ్వర స్వామి వారి గణపతి నవరాత్రి మహోత్సవాల పోస్టర్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతుల మీదగా బుధవారం ఆవిష్కరించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10న వినాయక చవితి పర్వదినం నుండి 18వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు ఉంటాయని, కరోనా దృష్ట్యా వినోద కార్యక్రమా లు రద్దుచేసి, సాంప్రదాయ, సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు పప్పల జయదేవ్ , ఉత్సవ కమిటీ చైర్మన్ నున్న నాగేశ్వరరావు, గూనూరు సత్యనారాయణ, సర్పంచ్ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు శరగడం సిమ్మి నాయుడు, జ్యోతుల రమేష్, అల్లాడ భవాని, శ్యామల, ఓరుగంటి నెహ్రు, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి.సత్యనారాయణ మూర్తి, ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతిరావు, పార్టీ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### 35వవార్డు అంగన్వాడీ భవనంలో
## వైయస్ఆర్ సంపూర్ణ పౌష్టికాహారం వారోత్సవాలు



విశాఖపట్నం : 35వవార్డులో బుధవారం మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మన ఉత్తరాంధ్ర అభివృద్ధి సారధి పెద్దలు రాజ్యసభ సభ్యులు వి.విజయసాయి రెడ్డి ఆశీస్సులు తో గౌరవనీయులైన జివియంసి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదేశాల తో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అన్ని అంగన్వాడి భవనం లో గర్భిణులు కు, పిల్ల తల్లులకు, పిల్లలు కు కోసం వైయస్ఆర్ సంపూర్ణ పౌష్టికాహారం వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా 35వ వార్డు వైయస్ఆర్సీపీ కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు హాజరయ్యారు. ఆయన చేతులు మీదుగా గర్భిణులు సోదరి లకు సంపూర్ణ పౌష్టికాహారం పిల్లలకు ప్రీ కేజి పుస్తకాలు అందించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ రాబోయే భవిష్యత్తు తరాల కోసం ఆలోచించే మన సీఎం అందరికి వైయస్ఆర్ సంపూర్ణ పౌష్టికాహార వారోత్సవాలు అందుబాటు లో తీసుకువచ్చారు అని కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ పౌష్టికాహారం తల్లులు తీసుకోవాలని మన కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ రావు చెప్పారు.

అలాగే మన 35వ వార్డ్ లో కళ్లు పాకలు, ప్రసాద్ గార్డెన్స్, వేలంపేట 1 అంగన్వాడి కేంద్రం లు అందరూ కలిసి స్టేడియం వద్ద అంగన్వాడి భవనం లో ఈ వైయస్ఆర్ సంపూర్ణ పౌష్టికాహారం వారోత్సవాలు కార్యక్రమం ఏర్పాట్లు చేశారు.

ఈకార్యక్రమంలో వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్.జగన్ మోహన్ రెడ్డికి మన ఉత్తరాంధ్ర అభివృద్ధి సారధి పెద్దలు రాజ్య సభ సభ్యులు వి.విజయసాయి రెడ్డి కి, మన కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావుకి అంగన్వాడి టీచర్లు, గర్భిణులు, పిల్లలు అందరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గవిరెడ్డి నాయకత్వంలో టీడీపీ కేడర్ పనిచేయాలి

- పార్టీలో గ్రూపులకు స్వస్తి పలకాలి
- మాడుగుల ఇంచార్జి రామానాయుడు
- రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు అచ్చన్న స్పష్టీకరణ



దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గానికి టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పని చేస్తారని ఆయన నాయకత్వంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజారపు అచ్చం నాయుడు స్పష్టం చేశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అచ్చంనాయుడు నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతూ గతంలో మాడుగుల టిడిపి కంచుకోటగా ఉందని మరలా పూర్వ వైభవం తీసుకురావడానికి క్యాడర్ అంతా గవిరెడ్డి నాయకత్వంలో పని చేయాలని గ్రూపులకు తోవలేకుండా పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా రామానాయుడు ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని వారి ఆగడాలకు, అడ్డగోలు అక్రమాలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రామానాయుడు నియోజకవర్గానికి చేసిన కృషి ఎంతో ఉందన్నారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో గవిరెడ్డి పోటీలో ఉంటారని అచ్చెన్నాయుడు హామీ ఇవ్వడంతో పార్టీ కేడర్లో నూతన ఉత్సాహం వచ్చిందని దేవరాపల్లి మండల టిడిపి అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ స్థానిక విలేకరులతో అక్కడి నుంచి ఫోన్లో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, మాడుగుల మండలాల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

## వార్డుల్లో డెంగ్యూపై అవగాహన



కాకినాడ : సీజనల్ వ్యాధులు డెంగ్యూ,మలేరియాపై ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహనా కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.స్థానిక 1వ వార్డు ఎఫ్ సి ఐ కాలనీలో డెంగ్యూ కేసు నమోదుకావడంతో అక్కడ నీటి నిల్వలు ఎక్కడైనా ఉన్నాయోమో గమనించి అక్కడ స్ప్రే చేయించడమే కాకుండా చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో కూడా తిరుగుతూ డెంగ్యూ మలేరియా జ్వరాలపై ప్రజలకు కరపత్రాలను ద్వారా అవగాహన కలిగిస్తూ చుట్టు ప్రక్కల ఇళ్ళలోకూడా స్ప్రే చేయించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు వారి ఇంటి చుట్టు ప్రక్కల మరియు వారి ఇళ్లల్లో నీరు నిలువ ఉండకుండా తరచుగా శుభ్రం చేస్తూ చూసుకోవాలని నిలవ మంచినీటి నీటిలోనే దోమలు గుడ్లు పెట్టడం ద్వారా సంతానోత్పత్తి చేస్తాయని, దీని వల్ల దోమల సంఖ్య అధికమై ప్రజల్లో వ్యాధిని వ్యాపింపజేస్తాయి కనుక ఆరంభంలోనే దోమల సంఖ్యను అదుపులో ఉంచి అందుకోసం నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు.అంతేకాక పూల కుండీలు కింద ప్లేట్లో కూడా నీరు ఉండడాన్ని గమనించామని, పాత టైర్లు ,కొబ్బరి బోండాలు ఈ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో ఉండకుండా చూసుకోవాలని తెలిపారు.

నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ నాగ నరసింహరావు మాట్లాడుతూ కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు ఇంటింటికి తిరుగుతూ డెంగ్యూ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని.. ముందు సంవత్సరండెంగ్యూ కేసులు ఎక్కడ నమోదు కాలేదని కరోనా భయంతో ప్రజలు మరెంతో జాగ్రత్తలతో ఉండటంతోనే ఆ సంవత్సరం కేసులు నమోదు కాలేదని ఇప్పుడు కరోనా తగ్గిపోయిందని ప్రజలు ఇంటిలోని పరిసర ప్రాంతాలను శుభ్రపరచడంలో నిర్లక్ష్యంతో వహించడంవల్లే డెంగ్యూ మలేరియా కేసుల సంఖ్య పెరుగుతున్నాయని ప్రతి ఒక్కరు తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకుంటూ జాగ్రత్త వహించాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణకు
# ప్రతి ఒక్కరూ పాటుపడలి

**- మట్టి వినాయక విగ్రహాలు , వ్రత కల్పల ను పంపిణీ చేసిన సనపల బంగారు రాజు**



మాధవధార : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఉత్తర నియోజకవర్గం ఆధ్యాత్మికవేత్త, కొత్త మహాలక్ష్మి అమ్మవారు ధర్మకర్త, శ్రీ మాధవ యువజన సమాజం అధ్యక్షులు సనపల బంగారు రాజు అన్నారు. బుధవారం మాధవధార లో గల కొత్త మహాలక్ష్మి అమ్మవారు ఆలయం ఆవరణలో తన సొంత నిధులతో సుమారు వెయ్యికి పైగా మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పము లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకుడిని పూజించడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోగలమని అన్నారు. భావి తరాల మనుగడను కాపాడుకోగలమని అన్నారు. రంగుల వినాయకుని పూజించి నిమర్జనం చేయటం వలన నదులు సముద్రాలు కలుషితమవుతాయి అని అన్నారు. దీనివలన మత్స్య సంపదను కోల్పోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాధవధార గ్రామస్తులు సనపల వరప్రసాద్, నంబాల సూర్యారావు, సనపల నరసింహస్వామి, సనపల అనిల్ కుమార్, పప్పల గౌరీ శంకర్ రావు, సనపల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# జీరోస్థాయి ప్రమాదాలతో ముందుకు సాగాలి

## ప్రాంతీయ మేనేజర్ ఎ.అప్పలరాజు



శ్రీకాకుళం : నార్త్ ఈస్ట్ కోస్ట్ రీజియన్ లో జీరో ప్రమాదస్థాయికి ఆర్.టి.సిని తీసుకురావాలని, భద్రతతో ముందుకుసాగాలని ఆర్.టి.సి డ్రైవర్లకు ప్రాంతీయ మేనేజర్ ఎ.అప్పలరాజు పిలుపునిచ్చారు. బుధవారం శ్రీకాకుళం ఆర్.టి.సి 2వ డిపోలో రహదారి భద్రతా పక్షోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ మేనేజర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత సర్వీసును కలిగి అతితక్కువ ప్రమాదాలతో వాహనాలను నడుపుతున్న ఏకైక శాఖ ఆర్.టి.సి మాత్రమేనని అన్నారు. దాదాపు 32 ఏళ్లకు పైగా సర్వీసును అందించి ఇంతవరకు చిన్నపాటి ప్రమాదమైన జరగకుండా జీరోస్థాయి ప్రమాదాలతో సర్వీసును అందించిన డ్రైవర్లు చాలా మంది మన శాఖలో ఉన్నారని అన్నారు. వారందరిని ఈ సందర్భంగా అభినందించుకోవలసిన ఆవశ్యకత ఎంతైన ఉందని, అందులో భాగంగా ఉత్తమ సేవలు అందించిన 5గురు డ్రైవర్లను ఈ సందర్భంగా సన్మానించుకోవడం జరుగుతుందని వివరించారు. ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్ల నుండి మిగిలిన డ్రైవర్లు మెళకువలు తెలుసుకోవాలని, చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని సూచించారు. ప్రతీ ఏడాది జనవరి మరియు జూలై మాసంలో రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించుకోవడం పరిపాటి అని వీటివలన డ్రైవర్లు చేసే చిన్నపాటి తప్పులను సరిచేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే వాటిని విశ్లేషించడం జరుగుతుందని, వీటిలో ద్విచక్ర వాహన ప్రమాదాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని చెప్పారు. ఇందుకు ద్విచక్ర వాహనాలతో డ్రైవర్లు పోటీపడటం, వాహనానికి వాహనానికి మధ్య దూరం ఖచ్చితంగా పాటించకపోవడమేనని అన్నారు. అలాగే కండక్టర్లు వాహనాన్ని ఆపిన తదుపరి మాత్రమే ప్రయాణీకులను దించడం లేదా ఎక్కించడం చేయాలని, లేనిఎడల ప్రమాదాలు జరుగుతాయని ఆయన సూచించారు. ప్రతీ డ్రైవరు వాహనాన్ని తీసే సమయంలో స్టీరింగ్ మరియు బ్రేక్స్ పనితీరును పరిశీలించుకోవాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే తక్షణమే మరామ్మతులు చేపట్టిన తదుపరి వాహనాన్ని తీయాలని సూచించారు.

ఇటువంటి చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. జాతీయ రహదారిపై వెళ్లే సమయంలో 6 లైన్ల రహదారిలో మధ్యభాగంలో, 4లైన్ల రహదారిలో కుడి వైపు మాత్రమే వాహనాన్ని నడపాలని, భద్రతతో ముందుకు సాగి జీరోస్థాయి ప్రమాదాలకు ఆర్.టి.సిని తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం 32 ఏళ్లకు పైగా సర్వీసును అందించి జీరోస్థాయి ప్రమాదాలతో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను ఇచ్చి ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన వారిలో విజయనగరం డిపో డ్రైవర్లు పి.ఎ.రావు, ఎం.ఎస్.ఎన్.రాజు, ఎస్.కోట డిపో డ్రైవర్లు ఎ.ఎస్.నారాయణ, సి.వి.రావు, శ్రీకాకుళం 2వ డిపో డ్రైవరు బి.వి.ఎస్.నారాయణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెకానిక్ ఇంజినీర్ విజయరత్నం, డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.వరలక్ష్మీ, డివిజనల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, 2వ డిపో మేనేజర్ కవిత, నార్త్ ఈస్ట్ కోస్ట్ రీజియన్ లో గల డిపో మేనేజర్లు, యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# దసరా పండుగ నాటికి కొత్త క్రీడా విధానం




అమరావతి: రాష్ట్రంలో దసరా పండుగ నాటికి కొత్త క్రీడా విధానాన్ని తీసుకువస్తామని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు. పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న 36 హరిత హొటళ్లను ఆధునికీకరించే ప్రయత్నంలో ఉన్నామని పేర్కొన్నారు. కరోనా కారణంగా ఆదాయం సగానికి పడిపోయిందని 2020-21 ఆర్థిక సంవత్సరానికి రూ.60 కోట్ల ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. హరిత హొటళ్లను బ్రాండింగ్ చేసేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. విశాఖ, పిచ్చుకలంక, సూర్య లంక, గండికోట ఇలా 13 చోట్ల ఐదు నక్షత్రాలు హొటళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల వివరాలు, సమగ్ర సమాచారం తెలిపేలా ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం డిజిటల్ మార్కెటింగ్ ప్రమోషన్ చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అవంతి వివరించారు.

విశాఖ, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజ్ తదితర ప్రాంతాల్లో సీప్లేన్‌లను నడిపేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. పర్యాటక శాఖలో ఐదేళ్ల సర్వీసు దాటిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీకి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కరోనా నిబంధనలతో ఈ నెల 27న పర్యాటక దినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కేవలం విదేశీ పర్యాటకుల కోసమే హొటళ్లలో విదేశీ బ్రాండ్ మద్యాన్ని విక్రయించాలని నిర్ణయం తీసుకున్నామని.. దాన్ని ప్రోత్సహించేందుకు కాదన్నారు. మరోవైపు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఆర్ఆర్) ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించేలా కొత్త విధానం తీసుకువస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తెలిపారు. కోచింగ్, ట్రైనింగ్, టోర్నమెంటులతో పాటు మౌలిక వసతులు కల్పించాల్సి ఉందన్నారు. కేవలం ప్రభుత్వంతోనే క్రీడాభివృద్ధి సాధ్యం కాదని.. ప్రజల సహకారం కూడా కావాలని విజ్ఞప్తి చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌ను అఫ్గానిస్థాన్ కంటే ఘోరంగా మార్చారు



అమరావతి: ఏపీ సీఎం జగన్ తన అరాచక పాలనతో ఆంధ్రప్రదేశ్‌ను అఫ్గానిస్థాన్ కంటే ఘోరంగా మార్చారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. ఆడబిడ్డలను హత్య చేసిన నేరస్థులు 21రోజుల్లో బయటకొచ్చేయటమే దిశ చట్టం అమలా?అని నిలదీశారు. "హంతకుల్ని 21 రోజుల్లో శిక్షిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. నేరస్థులు బయట తిరుగుతూ బాధితుల తల్లిదండ్రులను చంపుతామని బెదిరిస్తుంటే పట్టించుకునేవారు లేరు. 36 కేసుల్లో జైలుకెళ్లి బెయిల్‌పై బయట తిరుగుతున్న జగన్ తనలాంటి నేరస్థులు, ఆడబిడ్డల్ని చంపిన హంతకులు కూడా బయట ఉండాలనే ఆలోచనతో ఉన్నారా? కడప జిల్లా బద్వేలు మండలం చింతల చెరువులో శిరీషని చంపిన ఉన్మాదులు బెయిల్‌పై బయట తిరుగుతూ బాధితురాలి తల్లిదండ్రుల్ని చంపుతామని బెదిరిస్తున్నారు. దీనిపై వారు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ప్రొద్దుటూరులో లావణ్యపై దాడి చేసిన నిందితుడూ బయట తిరుగుతూ మరో దాడి చేస్తానని హెచ్చరిస్తున్నాడు. పోలీసులు మాత్రం నేరగాళ్లకు మద్దతు తెలుపుతూ.. అందరికీ న్యాయం చేశామని చెప్తున్నారు. లావణ్య చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తం భరిస్తానన్న ప్రభుత్వం ఇంతవరకూ రూపాయి సాయం కూడా చేయలేదు. విశాఖలో వాలంటీర్ ప్రియాంకపై దాడిచేసిన నిందితుడు నెల రోజులు తిరగకుండానే బెయిల్‌పై బయట తిరుగుతున్నాడు. ఆడ పిల్లలను ఆదుకోవటమంటే సొంత మీడియాకు కోట్ల రూపాయల ప్రకటనలివ్వటం కాదు. దిశ చట్టం తెచ్చాక నేను పేర్కొన్న బాధిత మహిళల కుటుంబాలకు ఏం న్యాయం చేశారు? ఎస్సీ విద్యార్థిని రమ్యను చంపిన మృగాడికి ఏం శిక్ష విధించారో మరో రెండు రోజుల్లో తేలిపోనుంది. బాధిత కుటుంబాల పక్షాన తెదేపా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది" అని లోకేశ్ అన్నారు.

# శ్రీవారి సర్వదర్శన టికెట్ల జారీ పునఃప్రారంభం..

## భారీగా తరలివచ్చిన భక్తులు



తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరుని సర్వదర్శనం టోకెన్ల జారీని తితిదే పునఃప్రారంభించింది. ఇందులో భాగంగా రోజుకు రెండు వేల టికెట్లను జారీ చేయనుంది. ప్రస్తుతం ఈ టికెట్లను చిత్తూరు జిల్లా భక్తులకే తితిదే పరిమితం చేసింది. కరోనా దృష్ట్యా ఏప్రిల్ 11 నుంచి ఈ టోకెన్ల జారీని నిలిపేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను పొందిన భక్తులకు టోకెన్లు ఇవ్వడం లేదు. ఒకసారి దర్శనం అనంతరం నెల వ్యవధి ఉంటేనే టోకెన్లు ఇస్తున్నారు. చాలా రోజుల తర్వాత శ్రీవారి సర్వదర్శనానికి అవకాశం రావడంతో టోకెన్ల కోసం భక్తులు తిరుపతి శ్రీనివాసం కాంప్లెక్స్‌లోని కౌంటర్లకు భారీగా తరలివచ్చారు.

# కేంద్రం కీలక నిర్ణయం..

## వాయుసేనకు 56 రవాణా విమానాలు




దిల్లీ: భారత వాయుసేన కోసం విమానాలు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 56 సీ-295 ఎండబ్ల్యూ రవాణా విమానాల కొనుగోలుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. స్పెయిన్ నుంచి 16 రవాణా విమానాలు కొనుగోలు చేయాలని నిర్ణయించిన కేంద్రం.. మిగతా 40 విమానాలను భారత్‌లోనే తయారీ చేయనున్నట్టు ప్రకటించింది. భారత్‌లో తయారీ, స్వదేశీ సామర్థ్యం పెంచుకోవడమే లక్ష్యంగా అడుగులువేస్తోంది.

మరోవైపు, ఈ విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేసిన 48 నెలల్లో స్పెయిన్ నుంచి విమానాలు పంపిణీ జరగనుంది. మిగతా 40 విమానాలు మాత్రం భారత్‌లో టాటా కన్సార్టియం 10 ఏళ్ల లోపు ఉత్పత్తి చేయనుంది. సైనిక విమానాన్ని భారతదేశంలో ఒక ప్రైవేట్ కంపెనీ తయారు చేసే తొలి ప్రాజెక్టు ఇదే కావడం గమనార్హం. స్వదేశీ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌తో రూపొందుతున్న ఈ రవాణా విమానాల తయారీ ఉపాధి కల్పనలో ఓ ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని కేంద్రం తెలిపింది.

ఏరోస్పేస్ ఎకో సిస్టమ్‌లో ప్రత్యక్షంగా అత్యంత నైపుణ్యం కలిగిన 600 ఉద్యోగాలు, పరోక్షంగా 3వేలకు పైగా ఉద్యోగాలతో పాటు అదనంగా మరో 3వేల ఉద్యోగావకాశాలు కలగనున్నాయి.

# చిన్నమ్మకు షాక్.. రూ.100కోట్ల విలువైన ఆస్తులు జప్తు!

చెన్నై: అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళకు ఆదాయపు పన్ను విభాగం అధికారులు గట్టి షాకిచ్చారు. అవినీతి కేసులో ఆమెకు చెందిన దాదాపు రూ. 100కోట్ల విలువైన ఆస్తులను ఐటీ శాఖ జప్తు చేసినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తమిళనాడులోని పయనూర్ గ్రామంలో దాదాపు 24 ఎకరాల్లో ఉన్న 11 ఆస్తులను ఐటీ శాఖ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఆస్తులను 1991-96 మధ్య జయలలిత సీఎంగా ఉన్న సమయంలో చిన్నమ్మ కొనుగోలు చేశారు. అప్పుడు వీటి విలువ దాదాపు రూ. 20లక్షలు కాగా.. ఇప్పుడు రూ.100కోట్ల వరకు ఉంటుందని అంచనా. 2014లో కర్ణాటక ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పులో ఈ 11 ఆస్తులను "ఆదాయానికి మించి ఆస్తులు'గా పేర్కొన్నారు. ఈ తీర్పు ఆధారంగానే ఐటీశాఖ ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అవినీతి కేసులో శశికళకు నాలుగేళ్ల జైలు శిక్ష పడిన విషయం తెలిసిందే. బెంగళూరులోని పరప్పణ అగ్రహారం జైలులో శిక్ష అనుభవించి ఈ ఏడాది ఆరంభంలో విడుదలయ్యారు.

తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి అయిన శశికళ.. ఆమె మరణానంతరం అన్నాడీంకే బాధ్యతలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి పదవికి ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే అవినీతి కేసులో శిక్ష పడటంతో జైలుకెళ్లాల్సి వచ్చింది. అనంతరం జరిగిన పరిణామాల్లో శశికళను పార్టీ నుంచి బహిష్కరిస్తూ అన్నాడీఎంకే నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు శశికళ తిరిగి అన్నాడీఎంకేలో చేరతారనే వార్తలు వినిపించినప్పటికీ రాజకీయాలకు దూరంగా ఉంటానని సంచలన ప్రకటన చేశారు.

# అవునవును.. ప్రభుత్వం అద్భుతాలే చేసింది

## : పవన్ కల్యాణ్ ఎద్దేవా



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రహదారుల దుస్థితిపై ప్రజల నుంచి ఉవ్వెత్తున నిరసన రావడంతో దాని నుంచి తప్పించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ రహదారులపై నిర్వహించిన సమీక్షలో.. ఎయిర్ పోర్టులు, షిప్పింగ్ యార్డుల అభివృద్ధి గురించి మాట్లాడటాన్ని పవన్ ప్రస్తావించారు. జనసేన పిలుపు మేరకు లక్షల మంది స్పందించి రోడ్ల దుస్థితిని తెలిపారన్నారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య దెబ్బ తిన్న రహదారులని పేర్కొన్నారు. 'సొంతిల్లు చిమ్ముకోవడానికి చీపురు లేదుగానీ పక్కిళ్లు చిమ్మేస్తాం.. కల్లాపు చల్లేస్తాం.. ముత్యాల ముగ్గులు పెట్టేస్తాం' అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో రోడ్లు నిర్మించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని.. ప్రజల దగ్గర నుంచి వసూలు చేస్తున్న పన్నులు ఎక్కడికి వెళ్తున్నాయని ప్రశ్నించారు. మంత్రులు అంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం అద్భుతాలే చేసిందని.. చిన్న గోతులను గొయ్యిల్లాగా.. గొయ్యిల్ని కాలువల్లా చేశారని విమర్శించారు. జనసేన పోరాటం ఆపబోమని.. ప్రజల పక్షాన రహదారులు మెరుగుపడే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని పవన్ స్పష్టం చేశారు. వినాయక చవితి ఉత్సవాలపై ఎందుకు నిషేధం విధించారో తనకు అర్థం కావడం లేదన్నారు. కొవిడ్ నిబంధనలు కేవలం చవితి పండగకు మాత్రమే వర్తిస్తాయా? వైకాపా ప్రజా ప్రతినిధులు, వారి కుటుంబసభ్యుల పుట్టిన రోజులకు వర్తించవా అని నిలదీశారు. చవితి వేడుకలపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని పవన్ డిమాండ్ చేశారు.

# సిఎంఆర్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ





విశాఖసిటీ : పర్యావరణ పరిరక్షణ మరియు పచ్చదనం సూరిగా సి.ఎం.ఆర్. ఆధ్వర్యంలో మట్టి మరియు విత్తనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను సి.ఎం.ఆర్. ఎండి మావూరి వెంకట రమణ తమ సంస్థలో ఉద్యోగులకు పంపిణీ చేసారు మరియు సి.ఎం.ఆర్. సెంట్రల్ నందు డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ చేతులు మీదుగా సెంట్రల్ కు విచ్చేసిన ప్రజలకు పంపిణీ చేయడం జరిగినది. ఈ వినాయక ప్రతిమ యొక్క ప్రత్యేకత ఏమిటంటే పూర్తిగా పర్యావరణానికి హాని కలిగించని బంక మన్ను మరియు విత్తనాలతో సమ్మేళనంతో తయారుచేయబడినవి. ఈ ప్రతిమలు పూజానంతరం తమ ఇంటివద్దనే నీళ్ళు పోసి నిమజ్జనం చేసిన వారం రోజుల తరువాత ఆ నిమజ్జనంగావించబడిన ప్రతిమ నుండి మొక్కలు మొలుస్తాయి. ప్రస్తుతం ఉన్న కోవిడ్ పరిస్థితులలో ఏవినాయక మంటపం, నిమజ్జన సమయంలో ఊరేగింపు అనుమతులు లేనికారణంచే ప్రజలందరూ తమ ఇంటివద్దే పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకున్ని పూజించి ఇంటివద్దనే నిమజ్జనం చేసి తద్వారా ఉత్పన్నమయ్యే మొక్కలను పరిరక్షించి పచ్చదనాన్ని పెంపొందించవచ్చునని సి.ఎం.ఆర్. అధినేత మావూరి వెంకటరమణ పిలుపునిచ్చారు.

# సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక దృష్టి సారించండి

- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన



విశాఖపట్నం : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వ్యాపించకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన మలేరియా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె 4వ జోన్ 33 వార్డు పరిధిలో బంగారుమెట్ట పరిసర ప్రాంతాలలో పర్యటించి, డోర్ నెం. 31-34- 99 ఇంటిలో 11 సంవత్సరాల భరత్ అనే బాలునకు డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయినందున ఆ ఇంటికి వెళ్లి బాలుని యొక్క యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చుట్టు ప్రక్కల 200 మీటర్ల వరకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించాలని మలేరియా సిబ్బందిని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు తెలపాలని, వర్షాలు పడుతున్నందున ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

వార్డులలో మలేరియాపై అవగాహన కల్పించే తనిఖీ స్టిక్కర్లు ను సరిగా పంపిణీ చేయని కారణంగా, బయాలజిస్ట్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మలేరియా స్టిక్కర్లును ప్రతి ఇంటికి అతికించాలని, ప్రతివారం ప్రతి ఇంటిని సందర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకొని సందర్శించినట్లు గోడపై స్టిక్కర్లు అంటించి, ఇంటి వారి వద్ద నుండి సంతకం పెట్టించుకోవలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా సహించేదిలేదని మలేరియా సిబ్బందిని హెచ్చరించారు.

ప్రతి మంగళవారం, శుక్రవారం "డ్రై డే" గా పాటించాలని ప్రజలకు తెలుపమని సూచించారు. ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, నాల్గవ జోనల్ కమిషనర్ బి.వి.రమణ, కార్యనిర్వాహక ఇంజనీరు చిరంజీవి, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస రాజ్, మలేరియా ఇన్స్పెక్టర్, శానిటరీ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన దుర్గగుడి పాలకమండలి సమావేశం



విజయవాడ: దుర్గగుడి పాలకమండలి బుధవారం రోజున ఏర్పాటు చేసిన సమావేశం ముగిసింది. పలు అంశాలపై పాలకమండలి చర్చించారు. సుమారు 66 అజెండాలపై చర్చించి, చాలా వరకు అంశాలను పాలక మండలి ఆమోదించింది. రానున్న దసరా ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లను చేస్తున్నట్లు పాలకమండలి వెల్లడించింది. ప్రతి భక్తుడికి 250 గ్రాముల దద్దోజనం, 250 గ్రాముల సాంబార్ రైస్‌ను ప్రసాదంగా ఇవ్వాలని దుర్గగుడి పాలకమండలి నిర్ణయించింది.

ఆలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికి కుంకుమ, అమ్మవారి ప్రతిమ ఉన్న డాలర్‌ను ఇవ్వనున్నట్లు పాలకమండలి పేర్కొంది. దసరా ఏర్పాట్లను చేయడానికి పాలకమండలి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. కలెక్టర్, కో ఆర్డినేషన్ కమిటీల సమన్వయంతో ఉత్సవాలకు బడ్జెట్‌ను కేటాయిస్తామని పేర్కొంది. గత దసరాకి ముఖ్యమంత్రి కేటాయించిన రూ. 70 కోట్ల నిధులకు సంబంధించి పనులను పూర్తి చేస్తున్నట్లు దుర్గగుడి దేవస్థానం చైర్మన్ పైలా స్వామినాయుడు, ఈవో భ్రమరాంబ వెల్లడించారు.

# ఏపీ నెడ్ క్యాప్ సమావేశంలో పాల్గొన్న చైర్మన కె కె.రాజు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్ గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన కె కె రాజు ఛైర్మన్ హెూదాలో బుధవారం మొదటిసారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం తాడేపల్లిలో గల కేంద్ర కార్యాలయంలో జరిగినది.ఈ సమావేశంలో నెడ్ క్యాప్ కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ రమణ రెడ్డి, డైరెక్టర్ కుమార్ రెడ్డి మరియు నెడ్ క్యాప్ జనరల్ మేనేజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపిన వంశీ కృష్ణ శ్రీనివాస్



మద్దిలపాలెం : విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ ని శివాజిపాలెం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్ డైరెక్టర్లు మాజీ కార్పొరేటర్ జీవి రమణి (ఏపీ స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డ్ డైరెక్టర్), షబ్నం ఆఫ్రోజ్ (వక్ఫ్ బోర్డు డైరెక్టర్), రీసు అనురాధ (ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్). అనంతరం వంశీకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి దుస్సాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్కరికి సముచితమైన స్థానం ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఈఏపీసెట్ (ఎంసెట్) 2021 ఫలితాలు విడుదల



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన ఏపీ ఎంసెట్-2021 (ఈఏపీసెట్) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంజనీరింగ్‌కు సంబంధించి విజయవాడలో బుధవారం ఫలితాలు విడుదల చేశారు. 1,34,205 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. దాదాపు 80 శాతం మంది అర్హత సాధించారని వెల్లడించారు. విద్యార్థులు రేపటి నుంచి ర్యాంకు కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అగ్రి, ఫార్మా ఫలితాలు ఈ నెల 14న ప్రకటిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో.. మొదటి ర్యాంకు నిఖిల్ (అనంతపురం), 2వ ర్యాంకు మహంత నాయుడు (శ్రీకాకుళం), 3వ ర్యాంకు వెంకట తనీష్( వైఎస్ఆర్ జిల్లా), 4వ ర్యాంకు దివాకర్ సాయి, (విజయనగరం), మౌర్య రెడ్డి (నెల్లూరు) 5వ ర్యాంకు సాధించారు.



రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ని తాడేపల్లిలో ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్ మరియు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కె.కె రాజు

# శివప్రసాద్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం



వైఎస్సార్ జిల్లా: ప్రొద్దుటూరులోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభకు ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. "సొంత నిధులతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా రైతాంగానికి సంక్షేమం అందించేందుకు ఆర్‌బీకే కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలు స్వయంగా తమ కాళ్లపై నిలబడేలా అభివృద్ధి చెందాలనేదే ముఖ్యమంత్రి ఆలోచన" అని తెలిపారు.

"ఎంత త్వరగా రైతులను ఆదుకుంటున్నాము అనేదే ఇక్కడ ముఖ్యం.. పంటల బీమా, పరిహారం, ఇన్పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వడం ద్వారా రైతులకు వడ్డీ భారం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రకటించి ఐదేళ్లలో కూడా పూర్తిగా చెల్లించలేదు. అలా కాకుండా ఎప్పటికప్పుడు ఇచ్చిన హామీని పూర్తి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభిప్రాయం. ఇవాళ దేశంలో అనేక రాష్ట్రాలు మన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకొంటున్నాయి" అని సజ్జల తెలిపారు. "స్వచ్ఛమైన ఆలోచన, అన్ని వర్గాలను తన కుటుంబాల లాగా భావించి కార్యక్రమాలు అమలు చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఆలోచన. గ్రామాల్లో ఆర్‌బీకేల్లో మరింత మెరుగ్గా పనిచేసేందుకు వీలుగా స్థానిక నేతలు సహకారం కావాలి. సహకార రంగం మరింత బలోపేతం కావాలంటే గ్రామాల్లో నేతలు కలిసి పనిచేయాలి. జిల్లాకు నీరు వస్తుందా రాదా అన్న కల నుంచి ఇప్పుడు 60 టీఎంసీల నీరు నిల్వ చేసే స్థాయికి వెళ్లడం వైఎస్ కుటుంబం చలువ. వరద జలాలు కిందికి వృధాగా వెళ్లకుండా నీటిని ఒడిసిపట్టి నీటిని నిల్వ చేసుకుంటున్నాం" అన్నారు సజ్జల.



చాతుర్మాస్య దీక్ష లో భాగంగా హిమాలయ పాద ప్రాంతమైన రిషికేశ్ లో దీక్షలో ఉన్న విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారు, శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి వారిని రిషికేశ్ పీఠ ప్రాంగణంలో దర్శించుకుని మహాస్వామి వారి ఆశీస్సులు అందుకున్న పెందుర్తి ఎమ్మెల్యే అధీప్‌రాజ్

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com